# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 20-6-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2011 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి:26 | సంచిక: 280 | పేజీలు:4 | వెల: రూ.1/-


## విశ్రాంత ఐఏఎస్ బిపి విఠల్ కన్నుమూత

### సంతాపం తెలిపిన సిఎం కెసిఆర్

హైదరాబాద్,జూన్19(ఆర్ఎన్ఎ): ప్రముఖ ఆర్థికవేత్త, విశ్రాంత ఐఏఎస్ అధికారి బి.పి.విఠల్ కన్నుమూశారు. శుక్రవారం ఉదయం బంజారా హిల్స్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ తుదిశ్వాస విడిచారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు చెందిన విఠల్ 1950 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక, ప్రణాళికశాఖ కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేసిన ఆయన ఐఎంఎఫ్ సలహాదారుగా, పదో ఆర్థికసంఘం సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించారు. ఉమ్మడి ఏపీలో పలువురు ముఖ్యమంత్రుల వద్ద వివిధ హోదాల్లో పనిచేశారు. సెస్ ఏర్పాటులో ముఖ్య భూమిక పోషించారు. విఠల్ మృతి పట్ల సంతాపం తెలిపిన తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్... ఆయన సేవలను స్మరించుకున్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు సీఎం కేసీఆర్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక, ప్రణాళిక శాఖల కార్యదర్శిగా విఠల్ పనిచేశారు. బీపీఆర్ విఠల్ కుమారుడైన సంజయ్ బారు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు మీడియా సలహాదారుగా వ్యవహరించారు. బీపీఆర్ విఠల్ మృతిపట్ల మంత్రి కేటీఆర్ సంతాపం తెలిపారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ మనుగడపై తన 'తెలంగాణ సర్ప్లసెస్' పుస్తకం ద్వారా నివృత్తి చేశారని కేటీఆర్ ట్విటర్‌లో వెల్లడించారు.

# గాల్వన్‌లో దారికి రాని పరిస్థితులు

### దళాలను మోహరిస్తున్న చైనా
### అప్రమత్తం అయిన భారత్ దళాలు

న్యూఢిల్లీ, జూన్ 19(ఆర్ఎన్ఎ): ఎల్ఏసీలో దురాక్రమణలకు తెరతీస్తున్న చైనా తీరుతో.. సరిహద్దుల్లో ఇంకా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. చైనా తీరు మారని నేపథ్యంలో గాల్వన్ లోయపై ఎట్టి పరిస్థితుల్లో పట్టు కోల్పోకుండా భారత సైన్యం కాపు కాస్తోంది. శాటిలైట్ చిత్రాల ఆధారంగా ఓ పక్క చైనా కుట్రల్ని బయటపెడుతూనే.. చైనాను నిలువరించేందుకు భద్రతా బలగాల్ని పెద్ద సంఖ్యలో ఆ ప్రాంతంవైపు మోహరిస్తోంది. చైనాకు చెందిన 2 వందలకు పైగా వాహనాలు, భారీగా సైనికులు గాల్వన్ లోయ ప్రాతంలో ఉన్న విషయాలు ఇప్పటికే ఉపగ్రహ చిత్రాల ద్వారా బయటపడింది. జూన్ 6న తేదీన రెండు దేశాల మధ్య కుదిరిన ఒప్పందం చైనా ఉల్లంఘించిన నేపథ్యంలో.. సైన్యం మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది.

మరోవైపు, గాల్వన్ ఘటన తర్వాత మనదేశాన్ని దెబ్బతీయడానికి చైనా కుట్రలు పన్నుతూనే ఉంది. మనదేశానికి వ్యతిరేకంగా పాకిస్థాన్, నేపాల్‌లను ఎగదోస్తోంది. ఈ మేరకు చైనా అధికారిక పత్రిక గ్లోబల్ టైమ్స్ ఓ కథనం ప్రచురించింది. భారతదేశం చైనాపై దాడికి దిగితే పాకిస్థాన్, నేపాల్ నుంచి కూడా ప్రతిఘటన ఉంటుందని గ్లోబల్ టైమ్స్ పేర్కొంది. లిపులేఖ్, కాలాపానీ, లింపియధుర ప్రాంతాల గురించి ప్రస్తావించిన గ్లోబల్ టైమ్స్, పీఓకే, ఆర్టికల్-370 రద్దులను కూడా ప్రస్తావించింది. పొరుగుదేశాలతో భారత్‌కు ముప్పు పొంచి ఉందని, అందువల్ల చైనాపై దాడి చేసే సాహసానికి భారతదేశం ఒడిగట్టబోదని అభిప్రాయపడింది. గల్వాన్ లోయ నుంచి వైదొలిగి.. ఎవరి భూభాగం నుంచి వారు పనిచేసుకోవచ్చంటూ భారత్ ప్రతిపాదించినా చైనా మొండివైఖరి వీడడం లేదు. మేజర్ జనరల్ స్థాయిలో ఇప్పటికే 3 దఫాలుగా చర్చలు జరిగినా ఓ అంగీకారం కుదరలేదు.

సరిహద్దుల్లో అదనపు బలగాల ఉపహంహరణకు ఖఒం ఒప్పుకోకుండా.. మరింతగా మోహరిస్తోంది. ఇప్పటికి అసంతృప్తిగా చర్చలు ముగిసిన నేపథ్యంలో మరోమారు భేటీ జరిగే అవకాశం ఉంది. అలాగే 23న భారత్-చైనా విదేశాంగ మంత్రుల సమావేశం జరగబోతోంది. గల్వాన్ లోయపై సార్వభౌమాధికారం తమదేనన్న చైనా వాదన నిర్ద్వంద్వంగా తోసిపుచ్చిన భారత్.. ఇలాంటి ప్రకటనలు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని ప్రకటించింది. భారత విదేశీ వ్యవహారాల శాఖ ఇప్పటికే ఒంఅ విషయంలో భారత్ వైఖరిని స్పష్టం చేశారు. అటు.. చైనా విదేశాంగమంత్రి వాంగ్ యీతో భారత విదేశాంగ మంత్రి జై శంకర్ ఫోన్లో మాట్లాడారు. హద్దు మీరితే పరిణామాలు తీవ్రంగానే ఉంటాయని గట్టిగానే హెచ్చరించారు. అటు, ఇనుపముళ్లతో కూడిన రాడ్లతో భారత సైనికులపై జరిపిన దాడిపై చైనా సమాధానం చెప్పడం లేదు. అమరులైన జవాన్ల పోస్ట్‌మార్టంలో బయటపడిన విషయాలు చూస్తే చైనా దళాలు పథకం ప్రకారం ఎంత క్రూరంగా ప్రవర్తించాయో అర్థం చేసుకోవచ్చు. ఏదైమైనా ఈ విషయంలో చైనాకు క్లెళం వెయ్యాలంటే పరిమిత స్థాయిలో సైనిక చర్య చేపట్టి తీరాల్సిందే అనే వాదన కొందరు సైనిక నిపుణులు చెప్తున్నారు. ఈశాన్య లద్దాఖ్‌లో మిలటరీ యాక్షన్ అవసరమని వారు వాదిస్తున్నారు. రాజకీయంగా, దౌత్యపరంగా ఒత్తిడి పెంచుతూనే.. వాణిజ్యపరంగానూ చైనాను ఇబ్బందుల్లోకి నెట్టాలనే డిమాండ్ కూడా వినిపిస్తున్నారు.

## భారతీయ సైన్యాన్ని చైనా ఆర్మీ రెచ్చగొట్టింది

### సేనేటర్ మిచ్ మెక్‌కనల్ సంచలన వ్యాఖ్యలు

వాషింగ్టన్,జూన్19(ఆర్ఎన్ఎ): అమెరికా సీనియర్ నేత, సేనేటర్ మిచ్ మెక్‌కనల్.. చైనా సైన్యం వైఖరిపై సంచలన ఆరోపణలు చేశారు. చైనాకు చెందిన పీపుల్స్ లిబరేష్మన్ ఆర్మీయే.. గాల్వన్ లోయలో భారతీయ సైనికులను రెచ్చగొట్టిందని మిచ్ తెలిపారు. సేనేట్ సభలో ఆయన మాట్లాడుతూ.. కేవలం భారత భూభాగాన్ని ఆక్రమించాలన్న ఉద్దేశంతోనే.. భారతీయ సైన్యాన్ని చైనా ఆర్మీ రెచ్చగొట్టినట్లు ఆయన అభిప్రాయపడ్డారు. అమెరికాతో పాటు దాని మిత్ర దేశాలను కూడా చైనా కావాలనే టార్గెట్ చేస్తున్నట్లు ఆయన అన్నారు. రెండు అణ్వాయుధ దేశాలు సరిహద్దుల్లో కొట్టుకున్న తీరును ప్రపంచ దేశాలు గమనించాయని, ఉద్రిక్తతలు తగ్గాలని కోరుకుంటున్నామని, శాంతి కాంక్షిస్తున్నామని మెక్ కనల్ తెలిపారు.

సరిహద్దుల వద్ద ప్రజలను అత్యంత కిరాతంగా చంపి.. అంతర్జాతీయ హద్దుల్ని చైనా మారుస్తున్నట్లు సేనేటర్ ఆరోపించారు. కరోనా మహమ్మారిని అడ్డు పెట్టుకుని .. హాంగ్‌కాంగ్‌ను ఆధీనంలోకి తీసుకున్నట్లు చైనా కమ్యూనిస్టు పార్టీపై ఆయన విమర్శలు చేశారు. జపాన్ వద్ద ఉన్న శంకకూ దీవుల్లోనూ చైనా తన సైన్యాన్ని మోహరిస్తున్నట్లు ఆరోపించారు. ఇక ఆకాశంలోనూ చైనా జెట్ విమానాలు.. తైవాన్ గగనతలంలోకి దూసుకువెళ్లినట్లు విమర్శించారు. చైనా కమ్యూనిస్టు పార్టీని తరిమికొట్టాల్సిందే, ఇండియా దీంట్లో వెనుకాడదని తెలుసు, భారత్ గట్టి నిర్ణయమే తీసుకున్నదని మరో సేనేటర్ జిమ్ బ్యాంక్స్ తెలిపారు.

# భారత్‌లో ఆగని కరోనా విలయం

### తాజాగా 13,586 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ
### మరణించిన వారి సంఖ్య 12,573కు చేరిక
### ఏడాది చివరికల్లా వ్యాక్సిన్ రానుందన్న ఆశ

న్యూఢిల్లీ,జూన్19(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి భారత్‌లో విలయతాండవం చేస్తోంది. దేశంలో కరోనా పాజిటివ్ కేసులు రోజూ 10వేలకు పైనే నమోద వుతున్నాయి. భారత్‌లో గడచిన 24 గంటల్లో 13,586 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఒక్కరోజు వ్యవధిలోనే 336 మంది చనిపోయారు. దేశవ్యాప్తంగా కరోనా బాధితుల సంఖ్య 3,80,532కు చేరింది. ప్రస్తుతం 1,63,248 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకూ కరోనా నుంచి కోలుకొని 2,04,711 మంది డిశ్చార్జ్ అయ్యారు. కరోనా బారినపడి మరణించిన వారి సంఖ్య 12,573కు పెరిగింది. మహారాష్ట్ర, తమిళనాడు, ఢిల్లీలో కరోనా ఉధృతి కొనసాగుతోంది. పదివేలకు పైగా కేసులు నమోదవడం వరుసగా ఇది ఎనిమిదో రోజు. ప్రపంచంలో కరోనా కేసుల సంఖ్యలో అమెరికా, బ్రెజిల్, రష్యా తర్వాతి స్థానంలో భారత్ కొనసాగుతోంది.

దేశంలో కరోనా మహమ్మారి ప్రమాదకర స్థాయిలో విజృంభించడంతో ప్రజల్లో ఆందోళన పెరుగుతోంది. సగటున రోజుకు పదివేలకు పైగా కొత్త కేసులు నమోదవుతున్నాయి. గడిచిన 24 గంటల్లో 13,586 కొత్త పాజిటివ్ కేసులు నమోదైనట్లు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ శుక్రవారం ఉదయం విడుదల చేసిన హెల్త్‌బులిటెన్ లో పేర్కొంది. ఇప్పటివరకు ఈ స్థాయిలో కేసులు నమోదవడం ఇదే ప్రథమం. తాజా కేసులతో కలుపుకొని దేశంలో ఇప్పటివరకు 3,80,532 కరోనా కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం కరోనా వ్యాప్తి ఉధృతిని చూస్తే మరికొన్ని గంటల్లోనే దేశంలో కరోనా కేసుల సంఖ్య నాలుగు లక్షలకు చేరనుంది. గడిచిన 24 గంటల్లో 336 మంది మృత్యువాతపడటంతో దేశంలో కరోనా మరణాల సంఖ్య 12,573కు చేరింది. ఇప్పటివరకు 2,04,711 మంది కరోనా నుంచి పూర్తిగా కోలుకొని డిశ్చార్జ్ అయ్యారు. ప్రస్తుతం 1,63,248 యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఇక ప్రపంచవ్యాప్తంగా 85.78లక్షల కరోనా కేసులు నమోదుకాగా, 4.56 లక్షల మంది ఈ మహమ్మారి కారణంగా మరణించారు. అమెరికాలో అత్యధికంగా 22.63 లక్షల కేసులు నమోదయ్యాయి. అమెరికా తర్వాత బ్రెజిల్(9.83 లక్షలు), రష్యా (5.61 లక్షలు) దేశాల్లో కరోనా కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. ఇక, ప్రపంచంలో అత్యధికంగా కరోనా వైరస్ కేసులు నమోదయిన దేశాల జాబితాలో భారత్ నాలుగో స్థానంలో ఉంది. ఇదిలావుంటే ఈ ఏడాది చివరికల్లా కోవిడ్ వ్యాక్సిన్ అందుబాటులోకి రానుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆశాభావంతో ఉన్నట్టు ఆ సంస్థ ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ సౌమ్య స్వామినాథన్ అన్నారు. కరోనా వైరస్ తాజా ఔషధ ప్రయోగాలపై జెనీవాలో జరిగిన మీడియా సమావేశంలో డాక్టర్ సౌమ్య మాట్లాడారు. పదిమందిపై వ్యాక్సిన్ క్లినికల్ ప్రయోగం జరుగుతోందని, వారిలో కనీసం ముగ్గురు వ్యాక్సిన్ సామర్థ్యాన్ని రుజువు చేసే ప్రయోగం మూడవ దశకు చేరుకున్నారని డాక్టర్ సౌమ్య చెప్పారు. గేమ్ చేంజర్ అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కితాబిచ్చిన హైడ్రాక్సిక్లోరోక్విన్‌కి కోవిడ్ మరణాలను నివారించే శక్తి లేదని మానవ ప్రయోగాల్లో తేలిపోయిందని సౌమ్య చెప్పారు.



సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొల్లమద్ది గ్రామంలో జలహిత అప్పర్ మానేరు ఫీడర్ ఛానెల్‌లో ఉపాధిహామీ పథకం ద్వారా పూడికతీత పనులను ప్రారంభించిన మంత్రి కెటిఆర్.

## కేసీఆర్ సారథ్యంలో జలవిప్లవం

### దీనికి పునాదిగా మరో నాలుగు విప్లవాలు
### సొంత నియోజకవర్గంలో మంత్రి కేటీఆర్ ప్రకటన

రాజన్నసిరిసిల్ల,జూన్19(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రంలో జల విప్లవం వచ్చిందని మంత్రి కేటీఆర్ అన్నారు. దీనికి పునాదిగా మరో నాలుగు విప్లవాలు రానున్నాయని చెప్పారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సర్వసభ్య సమావేశానికి ఆయన శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో రాబోతున్న నూతన విధానాల గురించి వివరించారు. రైతులకు అన్ని విధాలుగా మేలు చేకూర్చేందుకు నియంత్రిత సాగు విధానం తీసుకొచ్చినట్లు మంత్రి తెలిపారు. రైతుబంధు సక్రమంగా అందేలా క్షేత్ర స్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతుబంధుపై తప్పుడు ప్రచారం చేసేవారికి దీటుగా సమాధానం ఇవ్వాలన్నారు. దేశానికి ఆదర్శంగా రైతుబంధును తీసుకొచ్చిన సీఎం కేసీఆర్.. దాన్ని ఎగ్గొట్టి రైతులను మోసం చేసే ప్రయత్నం చేస్తారా? అని విపక్షాలను ప్రశ్నించారు. వర్షాకాలం సాగుకు నీళ్లు, విత్తనాలతో పాటు అన్నీ సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. అలాగే రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి శంకుస్థాపన చేశారు. తొలుత గంభీరావుపేట మండలం కొల్లమద్ది గ్రామంలో జలహిత కార్యక్రమంలో భాగంగా అప్పర్ మానేరు ఫీడర్ చానెల్‌లో ఉపాధి హామీ పథకం ద్వారా పూడిక తీత పనులను మంత్రి ప్రారంభించారు. ఇదే మండలంలోని నర్మాల గ్రామంలో రూ.8కోట్ల 40 లక్షలతో మానేరు వాగుపై నిర్మించతలపెట్టిన రెండు చెక్ డ్యామ్‌లకు శంకుస్థాపన చేశారు. నర్మాల రైతువేదిక నిర్మాణానికి భూమి పూజ చేశారు. అలాగే 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను ప్రారంభించారు.

## గ్రీన్‌ఫ్రైడేలో మొక్కలు నాటిన మంత్రి




గ్రీన్‌ఫ్రైడే సందర్భంగా తన అధికారిక నివాసంలో మొక్కలు నాటిన మంత్రి శ్రీనివాసగౌడ్

హైదరాబాద్,జూన్19(ఆర్ఎన్ఎ): మంత్రి కేటీఆర్ ప్రతి శుక్రవారం గ్రీన్ ఫ్రైడేగా పాటించి మొక్కలు నాటాలన్న పిలుపు మేరకు.. ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ హైదరాబాద్ లోని తన నివాసంలో మొక్కలు నాటారు. ఈత, జామ, అరెలియా, మందారం మొక్కలను తన కుమార్తె శ్రీహిత మనుమరాలు సిద్దిక్షతో కలిసి మొక్కలు నాటి నీళ్లు పోశారు.మేడ్చల్ జిల్లా తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని బిట్స్ పిలాని సమీపంలో హరితహారం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్, మంత్రి మల్లారెడ్డి తదితరులు పాల్గొని మొక్కలు నాటారు.

## చైనాపై ప్రధాని కఠిన నిర్ణయం తీసుకోవాలి

### -కల్నల్ సంతోష్ భార్య సంతోషి

సూర్యాపేట,జూన్19(ఆర్ఎన్ఎ): తన భర్త దేశం కోసం ప్రాణాలు అర్పించడం గర్వంగా ఉందని కల్నర్ సంతోష్ బాబు సతీమణి సంతోషి అన్నారు. తనకు వ్యక్తిగతంగా ఆయన దూరం కావడం ఎంతో బాధ కలిగించే విషయమని..అయితే ఆయన త్యాగంతో దేశం గర్విస్తోందన్నారు. ఆయన ప్రాణత్యాగం దేశ రోణలో సైన్యం ఎంతగా పోరాడుతుందో కూడా గుర్తించిందన్నారు.వీర మరణం పొందిన తన భర్త పరిణామం తర్వాతైనా ప్రధాని మోదీ చైనాకు ధీటుగా జవాబు చెప్పాలని ఆమె అన్నారు. అలాగే దేశంలో చైనా వస్తువులను బ్యాన్ చేయాలని కోరారు. బోర్డర్‌లో జరిగినదంతా లోకానికి తెలుసునని, తన భర్త ధైర్య సాహసాలతో ముందుకు వెళ్లారని, అందరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఈ విధంగా జరుగుతుందని అనుకోలేదని అన్నారు. సంతోష్ బాబుతో చివరి సారిగా 14వ తేదీ రాత్రి మాట్లాడానని చెప్పారు. చైనా వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా నిర్ణయం తీసుకోవాలని సంతోషి మరోసారి కోరారు.

## స్టీల్ బ్రిడ్జిని ప్రారంభించిన మంత్రులు

హైదరాబాద్,జూన్19(ఆర్ఎన్ఎ): దేశంలో ఎక్కడాలేని విధంగా మంత్రి కేటీఆర్ ఆదేశాలతో హైదరాబాద్ లో స్టీల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టినట్లు మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పంజగుట్టలో స్టీల్ బ్రిడ్జిని మంత్రులు, మేయర్ బొంతు రామ్మోహన్‌తో కలిసి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించడానికి ఈ వంతెన దోహద పడుతుందన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించేందుకు జీహెచ్ఎంసీ ప్రణాళికలు అద్భుతంగా ఉన్నాయని, వర్షాకాలంలో నగర ప్రజలు ఇబ్బందులు పడకుండా.. లాక్ డౌన్ సమయంలో జీహెచ్ఎంసీ డ్రైనేసీ, సివరేజ్ పనులు పూర్తి చేసిందని ప్రశంసించారు.

## ప్రపంచవ్యాప్తంగా 85 లక్షలు దాటిన కరోనా కేసులు

### మొత్తం 4,56,286 మంది మృతి

న్యూఢిల్లీ,జూన్19(ఆర్ఎన్ఎ): ప్రపంచ వ్యాప్తంగా కరోనా విజృంభన కొనసాగుతోంది. దీంతో ప్రపంచ దేశాలు వైరస్‌తో విలవిల్లాడుతున్నాయి. ప్రజల ఆరోగ్యంపైనే కాకుండా ఆర్థికంగా ఎంతో ప్రభావం చూపిస్తోంది. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా కరోనా కేసులు 85 లక్షలు దాటాయి. 4 లక్షల 56 వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఇక ప్రపంచవ్యాప్తంగా గత 24 గంటల్లో మొత్తం 85,78,283 పాజిటీవ్ కేసులు నమోదయ్యాయి. ఇప్పటి వరకు ప్రపంచవ్యాప్తంగా మొత్తం 4,56,286 మంది మృతి చెందగా.. కరోనా బారినపడి 45,30,266 మంది కోలుకున్నారు. అగ్రరాజ్యం అమెరికాలో కరోనా విలయం కొనసాగుతూనే ఉంది. న్యూజెర్సీ, న్యూయార్క్‌పై కరోనా ప్రభావం తీవ్రంగా ఉంది. అమెరికాలో గత 24 గంటల్లో మొత్తం 22,63,651 పాజిటీవ్ కేసులు నమోదయ్యాయి. ఇప్పటి వరకు 1,20,688 మంది మృతి చెందగా.. కరోనా బారిన పడి 9,30,994 మంది కోలుకున్నారు. బ్రెజిల్‌లో వైరస్ ఉధృతి కొనసాగుతోంది. గత 24 గంటల్లో మొత్తం 9,83,359 పాజిటీవ్ కేసులు నమోదయ్యాయి. ఇప్పటి వరకు 47,869 మంది మృతి చెందగా.. కరోనా బారిన పడి 5,20,360 మంది కోలుకున్నారు. రష్యాలో గత 24 గంటల్లో మొత్తం 5,61,091 పాజిటీవ్ కేసులు నమోదయ్యాయి. ఇప్పటి వరకు మొత్తం 7,660 మంది మృతి చెందగా.. కరోనా బారిన పడి 3,13,963 మంది కోలుకున్నారు. బ్రిటన్‌లో గత 24 గంటల్లో మొత్తం 3,00,469 పాజిటీవ్ కేసులు నమోదయ్యాయి. ఇప్పటి వరకు మొత్తం 42,288 మంది మృతి చెందగా.. కరోనా బారిన పడి 30,262 మంది కోలుకున్నారు. ఇటలీలో కూడా కేసుల తీవ్రత కొంచెం తగ్గినట్టు కనిపిస్తోంది. గత 24 గంటల్లో మొత్తం 2,38,159 పాజిటీవ్ కేసులు నమోదయ్యాయి. ఇప్పటి వరకు మొత్తం 34,514 మంది మృతి చెందగా.. కరోనా బారి న పడి 1,80,544 మంది కోలుకున్నారు.

## వెంటిలేటర్‌పై సత్యేందకర్ జైన్

### శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది
### మరో ఆస్పత్రికి తరలించి చికిత్స
### త్వరగా కోలుకోవాలని అమిత్ షా ఆకాంక్ష

న్యూఢిల్లీ,జూన్19(ఆర్ఎన్ఎ): ఇటీవల కరోనా పాజిటివ్‌గా తేలడంతో ఆస్పత్రిలో చేరిన ఢిల్లీ ఆరోగ్యశాఖ మంత్రి సత్యేందర్ జైన్‌కు వైద్యులు కృత్రిమ శ్వాస అందిస్తున్నారు. ఆయనపరిస్థితి విషమంగా ఉందని సమాచారం. దీంతో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. జైన్‌కు ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ మరింత ముదరడంతో సరిగా శ్వాస తీసుకోలేక పోతున్నారని, అందుకే కృత్రిమ శ్వాస అందిస్తున్నామని వైద్యులు తెలిపారు. బుధవారం నిర్వహించిన కరోనా నిర్ధారణ పరీక్షల్లో జైన్‌కు పాజిటివ్ వచ్చింది. దీంతో ఆయన ఢిల్లీలోని రాజీవ్‌గాంధీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేరారు. రెండురోజులుగా తీవ్ర జ్వరం, శ్వాస సమస్యలతో బాధపడుతున్న ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. కాగా, ఢిల్లీలో కరోనా ఉధృతంగా ఉన్న సమయంలో ఆరోగ్యమంత్రి ఆస్పత్రి పాలు కావడంతో.. ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా ఆరోగ్యశాఖ బాధ్యతలు చూస్తున్నారు.జైన్ ఆరోగ్యం క్షీణించడంతో ఆయనను నగరంలోని మరో ఆస్పత్రికి తరలించినట్టు అధికారులు వెల్లడించారు. కరోనాతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్న ఆయన న్యుమోనియాకు గురవ్వడంతో శ్వాసపర మైన ఇబ్బందులు తీవ్రమైనట్లు సమాచారం. ఇటీవల తీవ్ర జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తదితర సమస్యలతో సత్యేందర్ జైన్ రాజీవ్‌గాంధీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేరగా.. మంగళవారం కరోనా నిర్ధరాణ పరీక్షల్లో నెగెటివ్ వచ్చింది. కరోనా పరీక్షల్లో పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని ఆయనే స్వయంగా ట్విటర్‌లో వెల్లడించారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ 'కుందూరు' వంశమునకే
చందనము నలందినట్టి 'జానారెడ్డి'న
వందన సహస్రములిడి
కుందన మానసుడటంచు గొలుచుచు

(జూన్ 20 కుందూరు జానారెడ్డి జననం..)

-రాధశ్రీ
సెల్: 9494481210



## వసలకూలీలను త్వరగా తరలించండి

### -మరోమారు ప్రభుత్వాలకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ,జూన్19(ఆర్ఎన్ఎ): స్వస్థలాలకు వెళ్లాలనుకునే వలసకూలీలను పంపించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని, నిర్ణీత గడువులోగా అందరినీ స్వస్థలాలకు చేర్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు మరోసారి ఆదేశాలు జారీచేసింది. లాక్‌డౌన్ కారణంగా ఇతర రాష్ట్రాల్లో చిక్కుకుపోయి తమ స్వస్థలాలకు వెళ్ళాలనుకునే వలసకూలీలను పంపించేందుకు ఏర్పాట్లు చేయాలని ఈ నెల 9న దేశ సర్వోన్నత న్యాయస్థానం తీర్పు చెప్పింది. 15 రోజుల్లో వలసకూలీల తరలింపును పూర్తి చేయాలని ఈ తీర్పులో స్పష్టం చేసింది. కరోనా మహమ్మారిని నిరోధించేందుకు అమలు చేస్తున్న దేశవ్యాప్త అష్ట దిగ్బంధనం కారణంగా వలస కూలీలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా స్వీకరించి విచారణ జరుపుతున్నది. ఇందులో భాగంగానే 15 రోజుల్లోగా వలస కూలీలను సొంత ప్రాంతాలకు పంపాలని ఈ నెల 9న ఆదేశించింది. అంతేగాక కూలీలపై ప్రయాణ ఖర్చుల భారం వేయొద్దని కూడా న్యాయస్థానం పేర్కొన్నది.




# కుతంత్రాలను కట్టిపెట్టని కుట్రల చైనా

నేటి నిజం

శనివారం 20-6-2020

సరిహద్దు దేశాలతో సఖ్యతగా ఉండాలన్నది ముందు నుంచీ భారత్ ఆకాంక్ష. గత పాలకులు, ప్రస్తుత పాలకులు కూడా ఇదే విధానంలో ఉన్నారు. భారతీయ సంస్కృతిలోనే వసుధైక కుటుంబం అన్న సిద్ధాంతం జీర్ణించుకుని పోయింది. అందుకే భారత దేశంపై ఇతర దేశాల వారు దాడి చేసి, ఇక్కడి సంస్కృతిని, సంప్రదాయాలను ధ్వంసం చేశారు తప్ప...భారత దేశం ఏనాడూ ఇతర దేశాలను ఆక్రమించు కోలేదు. అందుకే అనేకులు ఈ దేశాన్ని ఆక్రమించుకోవడం, సంపదను దోచుకోవడం...సంస్కృతిని ధ్వంస చేయడం జరిగింది. చివరకు దేశాన్ని విభజించి విచ్ఛిన్నం కూడా చేశారు. అయినా భారత్ ఏనాడు పొరుగుదేశాలతో కయ్యాన్ని కోరుకోలేదు. వారితో సఖ్యతగా ఉండి ఇచ్చిపుచ్చుకునే ధోరణితోనే ఉంటోంది. పాకిస్థాన్, బంగ్లాదేశం, నేపాల్, శ్రీలంక, భూటాన్, చైనా దేశాలతో స్నేహాన్ని కోరుకుంటూ వస్తోంది. అయితే ఇందులో చైనా, పాక్ దేశాలు పక్కలో బల్లెంలా నిత్యం కుట్రలు కుతంత్రాలు పన్నుతూ దాడులు చేస్తూనే ఉన్నాయి. చైనా అయితే దాడులతో పాటు మన భూభాగాలను ఆక్రమించుకునే కుట్రలు చేస్తోంది. నెహ్రూ కాలంలోనే మావో చేసిన కుట్ర అంతా ఇంతా కాదు. నాటి ప్రధాని నెహ్రూ శాంతి గీతిక పాడారు. అయినా చైనాలో మార్పు రాలేదు. నిరంతరం సరిహద్దులను ఆక్రమించుకోవడమే లక్ష్యంగా చైనా కుట్రలు చేస్తుందనడానికి గాల్వన్ ఘటనలే నిదర్శనం. ప్రధానిగా మోడీ బాధ్యతలు చేపట్టాక సరిహద్దు దేశాలతో సఖ్యతను మరింతగా పెంచాలని అనుకున్నారు. వారితో స్నేహం కావాలని ఆకాంక్షించారు. చైనా నాయకులతో నరేంద్ర మోదీ ఏర్పరచుకున్న సంబంధాలను ప్రపంచ దేశాలు కూడా శ్లాఘించాయి. 2014లో ప్రధానమంత్రి అయిన తరువాత మోదీ పర్యటించిన తొలి దేశం జపాన్. ఆయన స్వాగతించిన తొలి అగ్రరాజ్య అధినేత చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్. చైనా నాయకులతో మోదీ నెరపిన సన్నిహిత సంబంధాలలో వ్యాపార బంధం కూడా దాగివుంది. తొలిసారి బీజింగ్‌ను సందర్శించిన తరువాత చైనా వ్యాపార నిర్వహణ పద్ధతుల నుంచి నేర్చుకోవాలని గుజరాత్ అధికారులను ఆయన ఎంతగానో ప్రోత్సహించడం జరిగింది. ఆయన ఆధ్వర్యంలో గుజరాత్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'వైబ్రంట్ గుజరాత్' సదస్సులలో కనీసం 25 చైనీస్ కంపెనీలు పాల్గొనేవి. పలు కంపెనీలు గుజరాత్‌లో భారీ పెట్టుబడులు కూడా పెట్టాయి. ఇదంతా కూడా వ్యాపారబంధంతో పాటు, సరిహద్దు సమస్యలు రాకుండా స్నేహంగా ఉండాలని అభిలషించి తీసుకున్న నిర్ణయం తప్ప మరోటి కాదు. అయితే దేశాల మధ్య స్నేహ సంబంధాలను, అందునా భారత్, చైనాల మధ్య అధినేతల మధ్య సంబంధాలు బాగుంటే సరిహద్దుల సమస్యలు ఉండవని, యుద్ధాలకు ఆస్కారం ఉండదని భావిస్తారు. అయినా లద్దాఖ్‌లో ఇరుదేశాల సైనిక దళాల మధ్య హింసాత్మక ఘర్షణలు చైనా దుర్నీతిని బయటపెట్టింది. మనమెంత స్నేహాన్ని కోరుకున్నా అందుకు చైనా సిద్ధంగా లేదని నెహ్రూ నుంచి నేటివరకు జరిగిన ఘటనలు రుజువు చేస్తున్నాయి. కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత భారత ప్రధానమంత్రి అక్షరాలా ఒక ప్రపంచ యాత్రికుడుగామారాడు.! పాలనావ్యవహారాలను సమూలంగా మార్చి వేస్తున్న శక్తిమంతమైన నాయకుడుగా ప్రపంచానికి చూపారు. దేశాల మధ్య సంబధాలే ముఖ్యమని చాటారు. గత ఆరు సంవత్సరాలుగా ఇలాంటి బంధాలకే ఎనలేని ప్రాధాన్యం ఇచ్చారు. ఈ క్రమంలోనే మధ్యాసియా దేశాలలో పర్యటించి స్వదేశానికి తిరిగివస్తూ, పర్యటన కార్యక్రమంలో లేనప్పటికీ లాహోర్ విమానాశ్రయంలో ఆకస్మికంగా ఆగి, తన మనవరాలి వివాహ వేడుకల్లో ఉన్న ప్రధాని నవాజ్ షరీఫ్ స్వగృహానికి వెళ్ళి ఆయనకు శుభాకాంక్షలు తెలిపి ఉపఖండ ప్రజలను మోదీ ముగ్ధులను చేశారు. సుహృద్భావం వెల్లివిరిసిన కొద్ది వారాలకే పఠాన్ కోట్‌లోని సైనిక స్థావరంపై ఉగ్రవాద దాడి జరిగింది. అంటే పాక్‌కూడా నమ్మదగిన దేశం కాదని, అది స్నేహాన్ని కోరుకోవడం లేదని తేలింది. అటు చైనా, ఇటు పాక్ దేశాలు స్నేహం కన్నా శతృత్వానికే ప్రాధాన్యం ఇస్తాయని రూఢి అయ్యింది. ఈ దశలో మనం వారితో ఎంతగా మంచి కోరుకున్నా జరగదు. చైనా అధినేత జిన్ పింగ్‌కు మోదీ చక్కని ఆతిథ్యమిచ్చి ఎనిమిది నెలలు గడవక ముందే తూర్పు లద్దాఖ్ మంచుకొండలలో మారణ హోమం సంభవించింది. పాకిస్థాన్‌లో సైనిక పాలకులు ఉన్నా, పౌర పాలకులు ఉన్నా శాంతి చర్చల్లో చిత్తశుద్ధితో పాల్గొంటారనే భరోసా లేదు. ఇక చైనీయుల విషయానికి వస్తే నాలుగు దశాబ్దాలుగా వాస్తవాధీనరేఖ వెంబడి వున్న ప్రశాంత పరిస్థితులు కేవలం కొద్ది వారాల వ్యవధిలో పూర్తిగా ఆవిరైపోవడం నిజంగా చాలా బాధాకర విషయం. చైనా సైనిక దళాలు మన సైనికులపై ఆకస్మిక దాడి చేశాయని చెప్పడమంటే మన సైన్యం ఘోర వైఫల్యాన్ని అంగీకరిం చినట్లు కాదు. వివాదాస్పద సరిహద్దులో యథాస్థితి కొనసాగేందుకు ప్రయత్నించడంలో చైనా వ్యూహాత్మక సంకల్పాన్ని తప్పుగా అర్థం చేసుకున్నామని గుర్తించాలి. దీనికితోడు కరోనాతో ప్రపంచమంతా తమ దేశాన్ని దుమ్మెత్తి పోస్తుంటే ప్రపంచ దేశాల నుంచి వచ్చే ముప్పును పక్కకు తప్పించే యత్నాల్లో డ్రాగన్ ఉందని అర్థం అవుతోంది. కరోనాతో దిగజారిని ప్రతిష్ఠను చైనా ఎలాగూ తెచ్చుకోలేదు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసిన చైనా భారత్‌తో కయ్యానికి దిగడం ద్వారా తన రాజ్యకాంక్ష కుట్రలకు ఇది సమయమని భావించి ఉంటుంది. పాలకులు కరోనా కటట్టిలో లాక్‌డౌన సమస్యలతో ఉన్న నేపథ్యంలో దొంగదెబ్బ తీసి పైచేయి సాధించాలని చూసిందనే భావించాలి. అయితే గతంతో పోలిస్తే భారత్ కూడా సైనికంగా పాటవాన్ని పెంచుకుంది. అనేక ప్రపంచ దేశాలు భారత్‌కు మద్దతుగా ఉన్నాయి. ఈ విషయాలను గమనించ కుంటే నష్టపోయేది చైనాయే. ఆధునిక ప్రపంచంలో యుద్ధం అనేది నేరుగా ఉండదు. అలా చేస్తే చైనా ఆర్థిక మూలాలను దెబ్బతీయడానికి ప్రపంచ దేవాలు వెనకాడవు. కరోనా పాపంతో రగిలిపోతున్న ప్రపంచ దేశాలు ఇప్పటికే చైనాపై గుర్రుగా ఉన్నాయి. భారత్‌పై దాడితో అమెరికా తదితర యూరప్ దేశాలు కూడా ఆగ్రహంగా ఉన్నాయి. ఈ దశలో వివేచన చేయాల్సింది చైనాయే. అలాగే సరిహద్దులను కాపాడుకునే విషయంలో కూడా మనం గట్టిగానే నిలబడాలి. ఎంతటి యుద్ధానికైనా సిద్ధపడాలి.

## పట్టణ ప్రగతిపై అధికారులతో కలెక్టర్ సమీక్ష..!

### -వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశా నిర్దేశించిన జిల్లా కలెక్టర్ ఎం. హనుమంత రావు.



సంగారెడ్డి, జూన్ 19 (నేటినిజం ప్రతినిధి) పురపాలికల కు సంబంధించి ప్రతి నెల 1వ తేదీ విద్యుత్ బిల్లులు చెల్లించాలని, ఇతర లోన్ పేమెంట్స్ చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు సూచించారు.

గురువారం కలెక్టరేట్ నుండి మున్సిపల్ కమిషనర్లు, చైర్మన్ లు, వైస్ చైర్మన్ లు, తహసీల్దార్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పట్టణ ప్రగతిపై సమీక్షిస్తూ పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. పట్టణాల కంటే పల్లెలు బాగున్నాయని ,పల్లె ప్రగతి అద్భుతంగా జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు, పల్లె ల్లో జరిగిన ప్రగతి పట్టణాల్లో కనిపించడం లేదన్నారు. పురపాలికలకు సంబంధించిన గ్రీన్ ప్లాన్ బడ్జెట్ ను ఇతర పనులకు వినియోగించరాదని తెలిపారు.

అన్ని మున్సిపాలిటీలలో ప్రతిరోజు పారిశుద్ధ్య పనులు జరగాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణ జరగాలని, తడి పొడి చెత్త విడివిడిగా సేకరించాలని సూచించారు. ప్లాస్టిక్, పొడి చెత్తను అమ్మేలా చర్యలు తీసుకోవాలన్నారు .తడి చెత్తను ఎరువుగా మార్చడానికి అవగాహన కల్పించాలని సూచించారు.

డంప్ యార్డ్ నిర్మాణాల విషయంలో ఏ సమస్యలు ఉన్నా పరిష్కరించాలని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ల కు సూచించారు. ప్రజలకు డంప్ యార్డ్ ఏర్పాటుపై సరైన అవగాహన కల్పించాలన్నారు. తడి చెత్తను ఎరువుగా మార్చితే ఎలాంటి వాసన రాదని, పట్టణాల్లో ఆ దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. కమిట్ మెంట్ తో పనిచేయాలని ,కార్యాచరణతో ముందుకు వెళ్లాలని సూచించారు. మున్సిపాలిటీలకు ట్రాక్టర్ ,ట్రాలీ, ట్యాంకర్ లు అవసరం ఉన్నట్లయితే బ్యాంక్ లోన్ కోసం అదనపు కలెక్టర్ ను సంప్రదించాలని సూచించారు.

ఈనెల 25 నుంచి ప్రారంభం కానున్న హరితహారం లో అన్ని పట్టణాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, అందుకు తగిన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ముందస్తు అన్ని ఏర్పాట్లతో ఉండాలని ట్రీ గార్డ్స్ కోసం ప్లాన్ చేసుకోవాలని తెలిపారు. మొక్కల పెంపకం బాగా జరగాలన్నారు. మొక్కలు పెట్టడమే కాకుండా వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా ఉంటుందని గుర్తు చేశారు.

వార్డుకొక నర్సరీని పెట్టి మంచి మొక్కలు పెంచాలని సూచించారు. మున్సిపల్ కార్మికుల హాజరు సరిగ్గా ఉండేలా చూడాలన్నారు. ప్రతిరోజు పారిశుద్ధ్య పనులు జరిగేలా వారి సేవలను సక్రమంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. అదనపు కలెక్టర్ ఆకస్మికంగా పారిశుద్ధ్య పనులను, మున్సిపల్ కార్మికుల హాజరు శాతాన్ని పరిశీలిస్తారని అన్నారు. కమర్షియల్ ప్రాంతాల్లోనూ హరింలో మొక్కలను పెంచవచ్చని పెద్ద మొక్కలు తెచ్చిపెట్టాలని ,అవసరమైతే మొక్కలను కొనాలని సంబంధిత అధికారులకు సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ రాజర్షి షా, జడ్పీ సీఈఓ రవి రెవిన్యూ డివిజనల్ అధికారి నగేష్ పబ్లిక్ హెల్త్ ఈ ఈ వీర ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రాన్స్‌లో స్లాటర్ మూసివేత

### - కబేళాకి చెందిన 730 మందికి కరోనా

ఫ్రాంక్ఫర్ట్,జూన్19(ఆర్ఎన్ఎ): జర్మనీలోని నార్త్ రైన్-వెస్ట్‌ఫాలియాలో ఓ కబేళాకి చెందిన 730 మంది సిబ్బందికి కరోనా వైరస్ సోకినట్టు గుర్తించారు. దీంతో గిటర్స్లోహ్ జిల్లాలోని టోనీస్ గ్రూప్ మీట్ ప్యాకింగ్ ప్లాంట్‌ను తాత్కాలికంగా మూసివేస్తూ స్థానిక అధికారులు ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 7 వేల మందిని క్వారంటైన్‌లో ఉంచారు. ఈ నెల 29 వరకు స్కూళ్లు, డేకేర్ కేంద్రాలను మూసివేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. వచ్చే మరికొద్ది రోజుల్లో 5 వేలకు పైగా కొవిడ్-19 పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్టు స్థానిక మీడియా వెల్లడించింది. మరోవైపు ఈ ఎ÷-లాంటులో కరోనా వైరస్ ఎలా వ్యాప్తి చెందిందనే దానిపై ఎన్ఆర్‌డబ్ల్యు ప్రభుత్వం విచారణ చేపట్టింది. గత నెల ఇదే రాష్ట్రంలోని కోస్‌ఫెల్డ్ జిల్లాకి చెందిన మరో మీట్ ప్రాసెసింగ్ ప్లాంట్‌లో 200 మందికి కరోనా వైరస్ సోకినట్టు గుర్తించారు.

## స్ట్రెచర్‌పై వచ్చి ఓటేసిన బిజెపి ఎమ్మెల్యే

అహ్మదాబాద్,జూన్19(ఆర్ఎన్ఎ): దేశవ్యాప్తంగా పది రాష్ట్రాల్లోని 24 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. దీంతో ఆయా రాష్ట్రాల్లో పోలింగ్ పక్రియ శుక్రవారం కొనసాగుతున్నది. ఎమ్మెల్యేలంతా ఆయా అసెంబ్లీల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. అయితే, గుజరాత్ బీజేపీ ఎమ్మెల్యే కేసరినాథ్ జెసంగ్‌భాయ్ సోలంకి అనారోగ్యం కారణంగా ఇటీవల ఆస్పత్రిలో చేరారు. రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో ఆస్పత్రిలో ఉన్నా ఆయన ఓటువేయక తప్పని పరిస్థితి ఏర్పడింది.

దీంతో బీజేపీ నేతలు ఈ ఉదయం ఆయనను అంబులెన్స్‌లో అసెంబ్లీకి తీసుకొచ్చి స్ట్రెచర్‌పై పోలింగ్ కేంద్రంలోకి తీసుకెళ్లారు. కాగా, ఓటు వేసిన అనంతరం ఎమ్మెల్యే సోలంకి నేరుగా ఆస్పత్రికి తిరిగి వెళ్లారు. సోలంకి ప్రస్తుతం మతార్ నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మొత్తం 10 రాష్ట్రాల్లో 24 స్థానాలకు ఎన్నికలు జరుగుతుండగా.. గుజరాత్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో నాలుగేసి స్థానాలకు, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో మూడేసి స్థానాలకు, జార్ఖండ్ నుంచి రెండు స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఇక ఈశాన్య రాష్ట్రాలైన మేఘాలయా, మణిపూర్, అరుణాచల్‌ప్రదేశ్, మిజోరం రాష్ట్రాల్లో ఒక్కొక్క స్థానానికి ఎన్నికలు జరుగుతున్నాయి.

# చైనా వస్తువుల నిషేధం ప్రజల చేతుల్లోనే

## ఎవరికి వారు వస్తువుల కొనుగోళ్లు ఆపాలి అప్పుడే మార్కెట్‌ను దెబ్బతీయగలం

న్యూఢిల్లీ,జూన్19(ఆర్ఎన్ఎ): ప్రపంచ దేశాలతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాలను తెంచుకోవడం అంత సులువు కాదు. ఈ ఒప్పందాలకు అంతర్జాతీయ కట్టుబాట్లు ఉన్నాయి. అందువల్ల చైనాతో యుద్ధం అనగానే చైనా వస్తువులను తిరస్కరించాలని, దిగుమతులను ఆపేయాలన్న డిమాండ్ పెరిగింది. దేశ వ్యాప్తంగా ప్రజలంతా ఈ వస్తువులను బహిష్కరించాలని పిలుపునిచ్చాయి. కేంద్రమే చైనా వస్తువుల దిగుమతులను ఆపేయాలన్న డిమాండ్ పెరిగింది. అయితే ఈ దశలో అది అంత సులువు కాదని అర్థం చేసుకోవాలి. ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందాలు, అంతర్జాతీయ ప్రమాణాలు ఇందులో ఇమిడి ఉంటాయి. ఇరాక్, చైనా వంటి దేశాలను ఆర్థిక దిగ్బంధం చేయడానికి ఐక్యరాజ్యసమితి, భద్రతాసంఘం ద్వారా అమెరికా ఎంతటి ప్రయత్నాలు చేసిందో తెలిసిందే. ఎటువంటి అంతర్జాతీయ సమ్మతి లేకున్నా, ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకునే సత్తా అమెరికాకు ఉన్నది. అంతటి అమెరికాకు కూడా చైనా విషయంలో వాణిజ్య, ఆర్థిక నిర్బంధాలు పెట్టడం గగనం అవుతున్నది. ఎందుకంటే, చైనాలో అమెరికా ఎంత ఉన్నదో, అమెరికాలో చైనా అంత వేళ్లు పాదుకుని ఉన్నది. చైనా వస్తువులన్నిటి దిగుమతులు భారత్ నిలిపివేస్తే, చైనాకు ఆర్థిక నష్టం జరిగేమాట నిజమే కానీ, మనకు జరిగేనష్టం చిన్నదేమీ కాదు. ప్రాణావసరమైన ఔషధాల దగ్గర నుంచి, అనేక ఎలక్ట్రానిక్ పరికరాల దాకా చైనానుంచే రావాలి. గాల్వన్ లోయలో జరిగిన దాడికి ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. మైన సైనికులను పొట్టన పెట్టుకున్న చైనాపై దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తం అయ్యాయి. చైనా నాయకుల ఫోటోలను, జెండాలను, కొన్నిచోట్ల చైనా తయారీ వస్తువులను తగులబెట్టి నిరసనలకు దిగారు. చైనా వస్తువులను నిషేధించి ఆ దేశాన్ని ఆర్థికంగా దివాలా తీయించాలని పిలుపునిస్తున్నారు. ఆయుధాలు పట్టుకుని సరిహద్దుల్లోకి వెళ్లడానికి తయారు అన్నట్టుగా యువత ప్రకటిస్తున్నది. దేశం అంటే ఇంతగా భావావేశం ఉండడం మంచిదే. అయితే నిజంగా మనం చైనా వస్తువులన్నిటిని నిషేధించగలమా? అన్నది ఆలోచన చేయాలి. ప్రజలుగా మనం వాటిని వాడకుండా చూసుకోవచ్చు. వాటి కొనుగోళ్లను ఆపవచ్చు. ఆ దేశపు ఉత్పత్తులు లేకుండా మన దైనందిన జీవితం నడుస్తుందని అనుకుంటే వాటిని ఎవరికి వారు కొనడం ఆపేయాలి. కొన్ని ప్రభుత్వ విభాగాల్లో చైనా వస్తువులను, కాంట్రాక్టులను విరమించుకొమ్మని కేంద్రం ఆదేశించినట్టు చెబుతున్నారు కానీ, అది అధికారికంగా వెలువడిన నిర్ణయమో కాదో తెలియదు. ఇప్పటికే కుదిరిన కాంట్రాక్టులను రద్దుచేసుకోవడం కానీ, ఫలానా దేశం సామగ్రిని కొనగూడదని నిర్ణయాలు తీసుకోవడం కానీ అంత సులువు కాదు. చైనా నుంచి చేసుకునే దిగుమతులన్నీ కలిపి, భారత్ మొత్తం దిగుమతుల్లో 13 శాతం దాకా ఉన్నాయి. భారత్ చేసే ఎగుమతుల్లో కేవలం 3 శాతం మాత్రమే చైనాకు జరుగుతున్నాయి. కొవిడ్-19 కారణంగా, ప్రపంచంలోని అనేక ఉత్పాదక పరిశ్రమలు ఇంకా లాక్‌డౌన్‌లో కునారిల్లుతుండగా, చైనాలో పరిశ్రమలు కోలుకుని ఉత్పత్తులు ప్రారంభించాయి. కరోనా అనంతర స్థితిలో కూడా చైనా ముందంజలోనే ఉన్నది. జాతీయోద్యమ కాలంలో, విదేశీవస్తువులు తక్కువ ఉండడం, ప్రధానంగా జౌళి పరిశ్రమ చేనేతను దెబ్బ తీయడం కారణంగా స్వదేశీ ఉద్యమం విజయవంతంగా సాగింది. విదేశీ వస్తువులను నిరాకరించడం అంటూ చేయాలనుకుంటే ముందుగా మన దేశంలో ఉత్పత్తి సాధ్యమయ్యే ప్రతి వస్తువుకీ మనదేశ మార్కెట్లో రక్షణలు కల్పించాలి. వ్యవసాయంలో దొడ్డిదారిన, రక్షణ రంగంలో బాహాటంగా విదేశీపెట్టుబడులకు తలుపులు తెరుస్తున్నపుడు వస్తు నిషేధం సాధ్యం కాకపోవచ్చు. ప్రజలు ఎవరికవారు చైనా వస్తువుల వాడకాన్ని ఆపేస్తే ఆ వస్తువులకు డిమాండ్ తగ్గుతుంది. అప్పుడు ఆ కంపెనీలే వస్తువులను అమ్మకుండా తోక మడుస్తాయి.

# ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా ట్రంప్ ద్విముఖ వ్యూహం

## చైనాను తిట్టడం..భారత్‌ను అభినందించడం ఓట్ల వేటలో సరికొత్త వ్యూహంలో అగ్రరాజ్యాధినేత

వాషింగ్టన్,జూన్19(ఆర్ఎన్ఎ): నవంబర్‌లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరుగనున్నాయి. మరోమారు అధ్యక్షపీఠం అధిష్ఠించాలని ట్రంప్ ఆరాటపడుతున్నాడు. ఇందుకోసం ప్రస్తుత పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చుకునే యత్నాల్లో ట్రంప్ ఉన్నారు. కరోనాతో దేశం అల్లకల్లోలం అవుతున్నా ఆయన దృష్టి అంతా రానున్న ఎన్నికలపైనే ఉంది. ఆయన చర్యలు, నిర్ణయాలు అంతా అటువైపుగానే సాగుతున్నాయి. ట్రంప్ మరోసారి అగ్రరాజ్యం అధికారాలు చేపట్టడానికి వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. చైనాను పదేపదే విమర్శిస్తూ కరోనాకు కారణమని నిందిస్తూ వచ్చారు. తాజాగా చైనా భారత్‌పై దాడి చేయడాన్ని కూడా తనకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. చైనాను తిట్టడం...భారత్‌ను వెనకేసుకుని రావడం ఇప్పుడు అత్యంతావశ్యకం. అందుకే ట్రంప్ గాల్వాన్ ఘటనపై పదేపదే ప్రకటనలు చేస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో ఖచ్చితంగా గెలవాలని ట్రంప్ భావిస్తున్నాడనడానికి ఇంతకన్నా నిదర్శనం అక్కర్లేదు. నవంబర్‌లో జరగబోయే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నారు. కాగా.. చైనా- అమెరికా సంబంధాలపై అమెరికా వాణిజ్య ప్రతినిధి రాబర్ట్ లైట్ జైజర్ గురువారం ఓ ట్వీట్ చేస్తూ.. అమెరికా-చైనా వాణిజ్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. వెంటనే దీనిని డొనాల్డ్ ట్రంప్ ఖండిస్తూ.. ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలను పూర్తిస్థాయిలో విడదీయడం సహేతుకమైన విధానం కాదంటూ వ్యాఖ్యానించారు. కాగా.. చైనా-అమెరికా వాణిజ్య ఒప్పందం చాలా గొప్పదని నేను భావిస్తున్నాను. మేము చైనీస్ ప్లేగుతో బాధపడుతున్నప్పటి నుంచి కూడా ఆ దేశంతో ప్రతిదానికి నేను భిన్నంగా ఉన్నాను. నేను ఎప్పుడూ చైనాపై కఠినంగానే వ్యవహరిస్తున్నాను. అమెరికా- చైనా వాణిజ్య ఒప్పందం ప్రకారం వ్యవసాయ ఉత్పత్తులను చైనా కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉందని చైనా అధికారి యాంగ్ జీజీ, అమెరికా విదేశాంగ కార్యదర్శి మైక్ పాంపియో పేర్కొన్నారు. అయితే.. అమెరికాలో కరోనావైరస్ మహమ్మారి వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ట్రంప్.. బీజింగ్‌కు వ్యతిరేకంగా తన మాటల వేడిని పెంచారు. కరోనాని చైనా నుండి వచ్చిన ప్లేగుగా,చైనీస్ వైరస్‌గా పేర్కొన్నారు. కరోనా వ్యాప్తి ప్రారంభ దశలో ఆ దేశం సమాచారాన్ని ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. దీనిపై ట్రంప్ మాజీ జాతీయ భద్రతా సలహాదారు జాన్ బోల్టన్ పలు ఆరోపణలు చేశారు. అమెరికా రైతుల నుంచి వ్యవసాయోత్పత్తులను చైనా కొనుగోలు చేయాలని ఆ దేశాన్ని ట్రంప్ కోరారని, పైగా అధ్యక్ష పదవికి నవంబరులో జరిగే ఎన్నికల్లో తనకు సాయం చేయాల్సిందిగా చైనా అధ్యక్షుడు జీ జిన్ పింగ్ ని కోరినట్లు ఆయన పేర్కొన్నారు. ఒసాకాలో గత ఏడాది జూన్‌లో జరిగిన జీ-20 సమావేశం సందర్భంగా వాణిజ్య అంశాలపై ఇరు దేశాల అధ్యక్షులు చర్చించారని జాన్ బోల్టన్ తన పుస్తకంలో వెల్లడించాడు. అదే సమయంలో రాబోయే అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలిచేందుకు చైనా అధ్యక్షుడి సాయాన్ని కోరినట్లు 'ది రూమ్ వేర్ ఇట్ హ్యాపెండ్' పుస్తకంలో జాన్ బోల్టన్ వివరించాడు. ఈ విమర్శల బారినుంచి బయటపడడానికి జాన్ బోల్టన్ రాసిన ఓ పుస్తకాన్ని డొనాల్డ్ ట్రంప్ బ్యాన్ చేశారు. దీంతో ట్రంప్ చర్యలు పలు అనుమానాలకు తావిస్తున్నాయి. బోల్టన్ వ్యాఖ్యలపై ట్రంప్ స్పందిస్తూ.. ఈ రచయిత చట్టాన్ని ఉల్లంఘించారని, ఇది తప్పుడు సమాచారమంటూ ట్వీట్ చేశారు. ఇందులో అన్నీ అబద్ధాలు, ఫేక్ స్టోరీస్ ఉన్నాయని అన్నారు. జాన్ బోల్టన్ ప్రచారం చేసుకుంటున్న సంఘటనలేవీ జరగలేదన్నారు. ఆయనను మూర్ఖుడుగా అభివర్ణించారు. మరోవైపు గాల్వన్ దాడిని తీవ్రంగా ఖండించారు. భారత్ పులులను రెచ్చగొట్టారని వ్యాఖ్యానించారు. అమెరికాలో ఎన్నారైల ఓట్లు పొందడానికి కూడా ఆయన ఎత్తులు వేస్తున్నారు. మొత్తంగా ఇప్పుడు ఎన్నికలు తప్ప మరో ధ్యాసలో ట్రంప్ లేరు.

## జర్నలిస్టులకు పండ్లు పంపిణీ చేసిన కలెక్టర్ ఎం. హనుమంతరావు.



సంగారెడ్డి జూన్ 19 (నేటినిజం ప్రతినిధి) కరోనా నేపథ్యంలో పోలీసులు, రెవిన్యూ వైద్యరంగానికి ధీటుగా జర్నలిస్టులు ప్రజల్లోకి వెళ్లి ప్రాణాలు పణంగా పెట్టి సమాజ హితం కోసం పనిచేస్తున్నారని జిల్లా కలెక్టర్ హనుమంతరావు పేర్కొన్నారు.

గురువారం కలెక్టరేట్ మినీ మీటింగ్ హాల్లో మీడియా ప్రతినిధులకు పండ్ల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మీడియా ప్రతినిధుల సాధకబాధకాలు అన్ని కూడా తెలుసుకున్నామని, త్వరలో మరోమారు మీడియా ప్రతినిధుల కు అవసరమైన కిట్స్ అందజేస్తామని కలెక్టర్ తెలిపారు.పండ్ల పంపిణీకి ముందుకు వచ్చిన దాతలు అందరిని ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు.

డాక్టర్ కులకర్ణి హోమియో మందులను అందజేయగా, ఫల పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ హరి కాంత్ ఆధ్వర్యంలో రైతు నరసింహారెడ్డి ,రమేష్ రెడ్డి లు డ్రాగన్ ఫ్రూట్స్ ను, కాలభైరవ నర్సరీ యజమాని అశోక్‌త గౌడ్ మామిడి వండ్లను అందజేశారు.రోగ నిరోధక శక్తి ప్రస్తుత పరిస్థితుల్లో చాలా అవసరమని, రోగనిరోధకశక్తిని పెంచే పండ్లను మీడియా ప్రతినిధులకు అందించడం సమంజసమని పేర్కొన్నారు.

కరోనా నివారణకు స్వీయ నియంత్రణ, ఎప్పటికప్పుడు శానిటేషన్ చేసుకోవడం , భౌతిక దూరం పాటించడం,మంచి ఆహారం తీసుకోవడం మంచిదన్నారు. ఇచ్చిన పండ్ల కిట్ లో అన్ని కూడా రోగనిరోధక శక్తిని పెంచే సి విటమిన్ కు సంబంధించిన వి ఉన్నాయన్నారు. ఇమ్యూనిటీ బూస్టర్ ప్రమోట్ చేసిన , మొదటగా మీడియా ప్రతినిధులకు ఇచ్చేలా చూస్తామన్నారు .హోమియో వైద్యం నెమ్మది గా పనిచేసిన బాగా పనిచేస్తుందని కలెక్టర్ తెలిపారు.

డ్రాగన్ ఫ్రూట్ మార్కెట్లో చాలా తక్కువగా దొరికిన ఎక్కువ ధరకు దొరుకుతుందని, అలాంటి పండ్లను ఉచితంగా పంపిణీ చేయడానికి ముందుకు వచ్చిన రైతు నరసింహారెడ్డి ని, డాక్టర్ కులకర్ణి, నర్సరీ యజమాని అశోక్ గౌడ్లను కలెక్టర్ తశాలువా కప్పి సన్మానించారు. దాతల నందరిని కూడగట్టుకుని మీడియా మిత్రులకు పండ్ల కిట్లను అందించడానికి తన వంతు సహకారాన్ని అందించిన జర్నలిస్టు పి.వి . రావు ను'లెక్టర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసంబంధాల అధికారి విజయలక్ష్మి ,మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆగని పెట్రో బాదుడు

న్యూఢిల్లీ,జూన్19(ఆర్ఎన్ఎ):దేశ వ్యాప్తంగా కరోనా నేపథ్యంలో విధించిన లాక్ డౌన్ కారణంగా ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పుడిప్పుడే సడలింపులతో బయటకి రావడం మొదలుపెట్టారు. ప్రజలు ఆర్థికంగా కొలుకోడానికి ఇంకా చాలా సమయం పట్టేలా ఉంది. ఇలాంటి పరిస్థితులలో సామాన్యుడి నెత్తిపై మరో భారం మోపనుంది ప్రభుత్వం. ఇప్పటికే పెట్రోలు, డీజిల్ ధరలు పెరుగుతూ ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. అయితే తాజాగా పెట్రోలు, డీజిల్ ధరలు మరో సారి పెరిగాయి. వరుసగా 13వ రోజు కూడా పెట్రో ధరలు పెరిగాయి. పెట్రోలుపై 55 పైసలు, డీజిల్‌పై 63 పైసల చొప్పున పెరిగాయి. దీంతో హైదరాబాద్ లో లీటరు పెట్రోలు ధర రూ. 81.36, డీజిల్ రూ.75.31గా ఉంది. అమరావతిలో పెట్రోలు రూ. 81.76, డీజిల్ రూ.75.73గా ఉంది. ఢిల్లీలో పెట్రోలు రూ. 78.37, డీజిల్ రూ.77.06. ముంబైలో లీటరు పెట్రోలు రూ. 85.21, డీజిల్ రూ.75.53కి చేరుకుంది.

## బాజిరెడ్డి భార్యకూ పాజిటివ్

హైదరాబాద్,జూన్19(ఆర్ఎన్ఎ): నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ భార్యకు కూడా కరోనా పాజిటివ్ అని తేలింది. ఇటీవల ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించగా నెగెటివ్ అని తేలింది. అయితే బుధవారం మరోసారి శాంపిల్స్ తీసి పరీక్షించగా పాజిటివ్ అని తేలింది. దీంతో ప్రస్తుతం ఆమె హైదరాబాద్ లో చికిత్స పొందుతుంది.. ఇటీవలే ఎమ్మెల్యే బాజిరెడ్డి కు కరోన కు పాజిటివ్ నిర్ధారణ అయిన విషయం తెలిసిందే.తెలంగాణ లో కరోనా వైరస్ రోజు రోజుకు విజృంభిస్తూనే వుంది. గడచిన 24 గంటల్లో రాష్ట్రంలో 352 మందికి పాజిటివ్ వచ్చింది. గురువారం జీహెచ్ఎంసీ పరిధిలోనే ఏకంగా 302 మందికి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. తాజా కేసులతో మొత్తం కేసుల సంఖ్య 6,027కి చేరింది. వీరిలో కరోనా మహమ్మారితో పోరాడుతూ 3,301 మంది కోలుకోగా.. 195 మంది చనిపోయారు. తెలంగాణలో ప్రస్తుతం 2,531 యాక్టివ్ కేసులున్నాయి.

## పురోగతిలో టీఆర్ఎస్ భవన నిర్మాణం

### -పరిశీలించిన మంత్రి ఎర్రబెల్లి

జనగాం,జూన్19(ఆర్ఎన్ఎ): టీఆర్ఎస్ కార్యాలయ భవన నిర్మాణ పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. హైదరాబాద్ నుంచి వరంగల్ వెళ్తూ.. మార్గ మధ్యంలో జనగామ జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న టీఆర్ఎస్ కార్యాలయాన్ని పరిశీలించారు. నిర్మాణ పనుల విషయమై తగు సూచనలు చేశారు. త్వరలో పార్టీ కార్యాలయం ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు. ఆయన వెంట జనగామ జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్ రెడ్డి, పలువురు పార్టీ నేతలు ఉన్నారు.త్వరలోనే జనగామజిల్లా టీఆర్ఎస్‌పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తామని దయాకర్‌రావు తెలిపారు. ఈసందర్భంగా నిర్మాణ పనుల విషయమై పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ నిర్మాణ పనులు వేగంగా పూర్తిచేయాలని ఆదేశించామన్నారు. సాధ్యమైనంత త్వరగా పార్టీ కార్యాలయాన్ని పూర్తిచేస్తే వెంటనే ప్రారంభిస్తామన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హరితహారం కోసం అంతా సిద్ధం కావాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కుల నాటే కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

## మాజీమంత్రి క్వార్టర్‌లో పేకాట

### -8మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

హైదరాబాద్,జూన్19(ఆర్ఎన్ఎ): మాజీ మంత్రి ముకేష్‌గౌడ్‌కు కేటాయించిన 129వ క్వార్టర్స్‌లో గురువారం రాత్రి పేకాడుతున్న 8 మందిని సైఫాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లోని ఆదర్శ నగర్‌లో గల న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మాజీ మంత్రి ముకేష్‌గౌడ్‌కు చెందిన క్వార్టర్స్‌లో రిటైర్ట్ ఉద్యోగులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు పేకాడుతున్నారనే సమాచారం మేరకు గురువారం రాత్రి సైఫాబాద్ పోలీసులు దాడులు జరిపి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 8 సెల్‌ఫోన్లు, రూ.1.12 లక్షల నగదు, 52 కార్డులు, 5 సీల్ చేసిన పేక డబ్బాలు, 3 సిగరెట్ పెట్టెలు, 2 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం ఉదయం వారిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అరెస్టయిన వారిలో హిమాయత్‌నగర్‌కు చెందిన రిటైర్డ్ ఉద్యోగి కిరణ్‌కుమార్, సైదాబాద్‌లోని వినయ్‌నగర్ కాలనీకి చెందిన సూపర్‌మార్కెట్ వ్యాపారి సతీశ్‌కుమార్, ఆదర్శ్‌నగర్‌కు చెందిన గోపాల్‌రావు, పద్మారావునగర్ కాలనీకి చెందిన ప్రదీప్, ఖైరతాబాద్‌కు చెందిన వ్యాపారి మురళి, హిమాయత్‌నగర్‌కు చెందిన రియల్టర్ మన్మోహన్, ట్రూప్ బజార్‌కు చెందిన జిమ్ ట్రైనర్ రాజ్‌కుమార్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## సరిహద్దు రక్షణకు ఆర్ఎస్ఎస్ వారిని పంపండి



న్యూఢిల్లీ, జూన్ 19: కాంగ్రెస్ నాయకుడు హుస్సేన్ దళవాయి కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. సరిహద్దు రక్షణకు ఆర్ఎస్ఎస్ వారిని పంపాలని అన్నారు. చైనా దళాలతో మాట్లాడేందుకు భారత సైనికులను కేంద్ర ప్రభుత్వం ఆయుధాలు లేకుండా పంపిందని ఆరోపించారు. సైనికులను పంపే ముందు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. పట్టించుకోకపోవడంతో అనుకోకుండా 20మంది సైనికులను కోల్పోయామన్నారు. కాలి చేతులతో మన సైనికులు వెళ్తే.. వారు (చైనా దళాలు) మేకులు కొట్టిన రాడ్లతో వచ్చారని ఆరోపించారు. జవాన్లను ఖాళీ చేతులతో ఎలా పంపుతారని.. వారు పోరాడేందుకు అవకాశమే లేకుండా పోయిందన్నారు. ఈ ఆర్ఎస్ఎస్ శాఖ వద్ద కర్రలున్నాయని, వారిని పంపితే సరిహద్దును రక్షిస్తారని ఎద్దేవా చేశారు. ఇదిలా ఉండగా భారత్-చైనా సరిహద్దులో ఉద్రిక్తతల నేపథ్యంలో పరిస్థితిపై చర్చించేందుకు శుక్రవారం సాయంత్రం 5గంటలకు ప్రధాని అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు.

## సీఎం ఆదేశాల మేరకు నడుచుకోవాలి

### -అధికారులకు మంత్రి ఎర్రబెల్లి సూచన

హైదరాబాద్,జూన్19(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ ఆదేశాలే అధికారులకు విధి విధానాలని, వాటిని తప్పకుండా పాటించాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ప్రగతి భవన్‌లో జరిగిన కలెక్టర్ల సమావేశంలో సీఎం కేసీఆర్ సమీక్షించి ఆదేశించిన పలు అంశాలపై మంత్రి పంచాయతీ

రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కమిషనర్ రఘునందన్ రావులతో కలిసి సమీక్షించారు. ప్రస్తుతం అమలవుతున్న పథకాలు, వాటి స్థితిగతులతోపాటు, తాజాగా సీఎం ఆదేశించిన ఆయా పథకాలపై మంత్రి సమీక్ష జరిపారు. ఆయా పనులు నిర్ణీత గడువులో జరిగేలా చూడాలని ఆదేశించారు. ఉద్యమ స్ఫూర్తితో, అధికారులు, ప్రజాప్రతినిధులు పని చేయాలని సూచించారు.

గ్రామాల వారీగా నాలుగేండ్ల ప్రణాళికలు, టౌన్ ఎ÷-లానింగ్ తరహాలోనే గ్రామ ప్రణాళిక కూడా ఉండాలని, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి దాకా ఈ ప్రణాళికలు సిద్ధం కావాలన్నారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో అలసత్వానికి తావులేదన్నారు. నరేగా నిధులతో రాష్ట్రంలో లక్ష కల్లాలను నిర్మించా లన్నారు. హరిత హారాన్ని విజయవంతంగా నిర్వహించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

## వలసకూలీలకు ఉపాధి కల్పన

### గరీబ్ కళ్యాణ్ యోజనకు 50వేల కోట్లు

### వెల్లడించిన కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ,జూన్19(ఆర్ఎన్ఎ): కరోనాతో పనిలేక సతమతమవుతున్న వలస కూలీలకు కేంద్ర సర్కారు తీపి కబురు అందించింది. 25 పథకాలను ఒకచోట చేర్చి గరీబ్ కళ్యాణ్ రోజ్‌గార్ అభియాన్‌గా ప్రవేశపెట్టిన స్కీం ద్వారా ఉపాధి అందించేందుకుగానూ రూ.50వేల కోట్లు మళ్లిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. వీటితో దేశవ్యాప్తంగా 116 జిల్లాల్లోని వలస కూలీలకు కనీసం 125 రోజులు పని కల్పించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. 25 పనుల కల్పనకు రూ.50వేల కోట్లు కేటాస్తున్నాం. కూలీలందరికీ పని లభిస్తుంది. దీంతో సంపద సృష్టి జరుగుతుంది. అలాగే, గ్రామీణాభివృద్ధి లక్ష్యం నెరవేరుతుందని ఆమె పేర్కొన్నారు. బీహార్, ఝార్ఖండ్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిశా, రాజస్థాన్‌లోని 116 జిల్లాల్లోని వలసకూలీలకు పని కల్పిస్తామని, కానీ వారి స్కిల్‌ను గుర్తించడమే పెద్ద పనిగా మారిందన్నారు. వారికి ఏరంగంలో అనుభవం ఉందో అదే పని కల్పిస్తామని, ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా పనిచేస్తాయని ఆమె పేర్కొన్నారు.

## 33యుద్ధ విమానాల కొనుగోలుకు ఐఎఎఫ్ ప్రతిపాదన

### -చైనా ఘర్షణల నేపథ్యంలో తాజా నిర్ణయం

న్యూఢిల్లీ,జూన్19(ఆర్ఎన్ఎ): లఢక్ సరిహద్దులో చైనాతో ఘర్షణ నేపథ్యంలో రష్యా నుంచి 33 యుద్ధ విమానాల కొనుగోలుకు భారత వాయుసేన (ఐఎఎఫ్) ప్రతిపాదించింది. వీటిలో 21 మిగ్-29, 12 ఎస్‌యు-30ఎంకెఐ యుద్ధ విమానాలున్నట్లు ప్రభుత్వ అధికార వర్గాలు గురువారం పేర్కొన్నాయి. వీటిని సమకూర్చుకోవాలని ఐఎఎఫ్ ఎప్పటి నుంచో ప్రయత్నిస్తున్నదని వారు చెప్పారు. తాజాగా చైనాతో ఘర్షణ నేపథ్యంలో వచ్చేవారం జరుగనున్న రక్షణశాఖ ఉన్నతస్థాయి సమావేశంలో రూ.6 వేల కోట్ల విలువైన ఈ ఒప్పందం గురించి ఐఎఎఫ్ ప్రతిపాదించనున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. ఇటీవల జరిగిన ప్రమాదాల్లో కుప్పకూలిన యుద్ధ విమానాల స్థానాన్ని వీటితో భర్తీ చేయాలని భారత వాయుసేన భావిస్తున్నట్లు వెల్లడించాయి.

## చైనా విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం: ప్రియాంక

న్యూఢిల్లీ,జూన్18(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వం బలహీనమైన వ్యూహాన్ని అవలంబిస్తోందని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రియాంకా గాంధీ ఆరోపించారు. చైనాతో రైల్వే కారిడార్ ఒప్పందం ద్వారా బీజేపీ ప్రభుత్వం ఆ దేశం ముందు మోకరిల్లిందని ఆమె ఆరోపించారు. సైనికులు 20 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇలాంటి పరిస్థితుల్లో మన దేశం.. చైనాకు బలమైన సందేశం ఇవ్వాలి. కానీ ఢిల్లీ లోని మీరట్ సెమీ హైస్పీడ్ రైల్ కారిడార్ ఒప్పందాన్ని ఆ దేశానికి అప్పగించడం ద్వారా ప్రభుత్వం ఒక బలహీనమైన వ్యూహాన్ని అనుసరించింది. ఇండియాలో ఎన్నో కంపెనీలు ఈ కారిడార్‌ను నిర్మించడానికి కావాల్సిన కెపాసిటీని కలిగి ఉన్నాయని ప్రియాంకా గురువారం ట్వీట్ చేశారు. ఈ ఒప్పందంతో చైనా కంపెనీకి మన దేశం 1,126 కోట్ల రూపాయల కాంట్రాక్టు అప్పగించిందని మండిపడ్డారు.

## కేరళ రంజీ జట్టు ప్రాబబుల్స్ జాబితాలో శ్రీశాంత్

### -సెప్టెంబర్‌తో ముగియనున్న నిషేధం

తిరువనంతపురం,జూన్19(ఆర్ఎన్ఎ): టీమిండియా బౌలర్, వివాదాస్పద క్రికెటర్ శ్రీశాంత్ పునరాగమనానికి మార్గం సుగుమమైంది. ఫిక్సింగ్ ఆరోపణలతో ఈ 37 ఏళ్ల కేరళ స్పీడ్‌స్టార్‌పై బిసిసిఐ విధించిన ఏడేళ్ల నిషేధం ఈ ఏడాది సెప్టెంబర్‌తో ముగియనున్న విషయం తెలిసిందే. అయితే ఈ నిషేధం ముగిసిన వెంటనే శ్రీశాంత్‌ను జట్టులోకి తీసుకోవాలని కేరళ క్రికెట్ అసోసియేషన్ (కెసిఎ) నిర్ణయించింది. రంజీ ట్రోఫీ కోసం ప్రకటించిన జట్టు ప్రాబబుల్స్ జాబితాలో అతని పేరు చేర్చింది. కాకపోతే శ్రీశాంత్ పునరాగమనం అతని ఫిట్‌నెస్‌పై ఆధారపడి ఉంది. జట్టు నిర్వహించే ఫిట్‌నెస్ టెస్ట్‌లో అతను గనుక నెగ్గితే మైదానంలోకి దిగడానికి శ్రీకి ఎలాంటి అడ్డు ఉండదు. ఇదిలా ఉండగా, కెసిఎ నిర్ణయం పట్ల శ్రీశాంత్ సంతోషం వ్యక్తం చేశాడు. ఈ అవకాశం పట్ల చాలా ఉత్సాహంగా ఉన్నా. రంజీ ట్రోఫీ ఆడే అవకాశం ఇస్తున్న కెసిఎకు నేను రుణపడి ఉంటా. నా ఫిట్‌నెస్ నిరూపించుకుని పునరాగమనం చేస్తా. అన్ని వివాదాలు సమసిపోయి మంచి రోజుల వస్తాయని ఆశిస్తున్నా' అని ఈ కేరళ పేసర్ చెప్పుకొచ్చాడు. 2013 ఐపిఎల్ సందర్భంగా రాజస్తాన్ రాయల్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ స్పాట్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డారన్న అభియోగాలపై శ్రీశాంత్, అజిత్ చండీలా, అంకిత్ చవాన్‌లపై బిసిసిఐ క్రమశిక్షణ కమిటీ జీవిత కాలం నిషేధం విధించింది. అయితే దీనిపై శ్రీశాంత్ న్యాయపోరాటం చేయడంతో.. గతేడాది మార్చి 15న సుప్రీంకోర్టు బోర్డు నిర్ణయాన్ని పక్కన పెట్టింది. ఈ కేసు 2019 ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు బెంచ్ ముందుకు వెళ్లింది. జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ కేఎం జోసెఫ్‌లతో కూడిన బెంచ్ మూడు నెలల్లో డీకే జైన్ సమీక్ష చేపడతారని పేర్కొంది. అనంతరం 2019 ఆగస్టు 7న జారీ చేసిన ఆదేశాల్లో జైన్... శ్రీశాంత్‌పై నిషేధాన్ని ఏడేళ్లకు పరిమితం చేశారు. ఈ ఏడాది సెప్టెంబర్‌తో ఆ వ్యవధి ముగియనుంది. శ్రీశాంత్ 36 ఏళ్ల వయసుకు రావడం, అది ఒక పేసర్ కెరీర్ ముగింపు దశ కావడమే తన నిర్ణయానికి కారణమని ఉత్తర్వుల్లో జైన్ పేర్కొన్నారు.

## నలమాసు కృష్ణను అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్,జూన్19(ఆర్ఎన్ఎ): మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలతో తెలంగాణ ప్రజాఫ్రంట్ ఉపాధ్యక్షుడు నలమాస కృష్ణను ఎన్ఐఏ అరెస్ట్ చేసింది. గతంలో పలు కేసుల్లో అరెస్ట్ అయిన నలమాస కృష్ణ 8 నెలలు జైలు జీవితాన్ని గడిపి, ఇటీవల బెయిల్‌పై విడుదలయ్యారు. అనారోగ్యం కారణంగా ఆయన ఖమ్మంలోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణ పోలీసులు నమోదు చేసిన కేసులపై ఎన్ఐఏ ఆరా తీస్తున్న అధికారులు కృష్ణను ఆదివారం ఖమ్మంలో అరెస్ట్ చేశారు. 14 రోజుల పాటు కస్టడీకి తీసుకునేందుకు ఎన్ఐఏ బృందం కృష్ణ కుటుంబ సభ్యులకు వారెంట్ కాపీని అందించారు. అయితే కృష్ణ భార్య సంధ్య , కూతుర్లు వెన్నెల , నందిని ఎన్ఐఏ తీరును తీవ్రంగా ఖండిస్తున్నారు. గతంలో రాష్ట్రాలు చేసిన వేధింపులకు తోడు ఇప్పుడు ఎన్ఐఏ అరెస్ట్ చేయడం కుట్రేనని ఆరోపించారు.

## చైనా వస్తువులను నిషేధించాల్సిందే : పాశ్వాన్

న్యూఢిల్లీ,జూన్19తత(ఆర్ఎన్ఎ): గల్వాన్ లోయలో భారత్-చైనా సైనికుల మధ్య ఘర్షణలు చెలరేగిన నేపథ్యంలో కేంద్రమంత్రి రాంవిలాస్ పాశ్వాన్ చైనా వస్తువులను బహిష్కరించాలని దేశ ప్రజలకు పిలుపు నిచ్చారు. ఇకపై చైనా నుంచి దిగుమతయ్యే వస్తువుల విషయంలో బిఐఎస్ క్వాలిటీ రూల్స్‌ను కచ్చితంగా పాటిస్తామని ఆయన ప్రకటించారు. రోజువారీ కార్యాలయ పనుల్లో చైనా వస్తువులను వాడకూడదని కార్యాలయాల్లో పనిచేసే వారికి ఆయన స్పష్టమైన ఆదేశాలిచ్చారు. చైనా ప్రవర్తన కారణంగానే ఆ దేశ వస్తువులను బహిష్కరించాలని అందరికీ పిలుపునిస్తున్నానని రాంవిలాస్ పాశ్వాన్ పేర్కొన్నారు. ఇతర దేశాలకు మన వస్తువులను ఎగుమతి చేసే క్రమంలో వారందరూ తనిఖీలు చేస్తారని, బాస్మతీ బియ్యాన్ని ఎగుమతి చేస్తే తిరస్కరిస్తారని అన్నారు. అయితే వారి వస్తువులు మన దేశానికి వస్తే మాత్రం కఠిన నిబంధనలు ఉండవని, ఇకపై నిబంధనలు కఠినతరం చేస్తామని పాశ్వాన్ ప్రకటించారు.

# రాహుల్ దేశ రాజకీయాలకు సరిపోలేతని వ్యక్తి

### సరిహద్దు సమస్యలపై కనీస పరిజ్ఞానం లేకుండా వ్యాఖ్యలు
### మండిపడ్డ కిషన్‌రెడ్డి, బిజెపి నేతలు

న్యూఢిల్లీ,జూన్19(ఆర్ఎన్ఎ): రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై బిజెపి మండిపడింది. సరిహద్దు సమస్యలపై ఏం మాట్లాడాలో తెలియని వ్యక్తి అని పార్టీ నేతలు విమర్శలు గుప్పించారు. రాహుల్ భారత రాజకీయాలకు సరిపోలని వ్యక్తి అని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. భారత్-చైనా సైనికుల ఘర్షణపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ ఇటీవల వరుస ప్రశ్నల వర్షం కురిపించాడు. భారత్ భూభాగంలోకి చైనా చొచ్చుకువచ్చిందని, గాల్వాన్ లోయలో ఆయుధాలు లేకుండా సైనికులు ఎందుకు వెళ్లారని, అసలు అక్కడ ఏం జరుగుతుందో వాస్తవాలను దేశ ప్రజలకు వివరించాలని రాహుల్ ప్రశ్నించాడు. రాహుల్ వ్యాఖ్యలపై కిషన్‌రెడ్డి మండిపడ్డారు. సరిహద్దుల విషయంలో మాట్లాడే ముందు కనీస పరిజ్ఞానం లేకుండా మాట్లాడడం తగదన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... స్థానిక, జాతీయ, అంతర్జాతీయ సమస్యలు రాహుల్‌కు అర్థం కావన్నారు.

అందుకే ఆయన ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. అతను మొత్తాన్నికే విఫలుడు. భారత రాజకీయాలకు అతడు సరిపోలడని ఆయన పేర్కొన్నారు. ఇదిలావుంటే గాల్వాన్ ఘర్షణ విషయం మీద ప్రధాని మోడీని ప్రశ్నించిన రాహుల్ గాంధీపై బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా మండిపడ్డారు.

దేశం కోసం 20 మంది సైనికులు తమ ప్రాణాలను త్యాగం చేసిన సమయంలో ప్రధానిని ప్రశ్నించడం ద్వారా రాహుల్ బాధ్యతారహితంగా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసేదాకా అయినా రాహుల్ వేచి చూడాల్సింద న్నారు. చైనాతో కుదుర్చుకున్న ఒప్పందం గురించి కాంగ్రెస్ మర్చిపోయి ఉంటుందని విమర్శించారు. ఇలాంటి సమయాల్లో ఇండియా గవర్నమెంట్‌ను నమ్మకపోవడం రాహుల్ గాంధీ బాధ్యతారాహిత్యమేనని చెప్పాలి. ప్రధాని మోడీకి వ్యతిరేకంగా వీరు మాట్లాడుతున్నారంటే.. అది ఓ వ్యక్తికి వ్యతిరేకమని కాదు, దేశ నాయకుడికి వ్యతిరేకంగా ఉందని గ్రహించాలని పాత్రా చెప్పారు. ఇదే విషయంపై బీజేపీ నాయకుడు రామ్ మాధవ్ కూడా స్పందించారు. ప్రతిపక్షాల ప్రవర్తన చాలా దురదృష్టకరం. దేశం మొత్తం ఆర్మీతోపాటు కేంద్ర సర్కార్ వైపు నిలిచిన సమయాన.. ప్రతిపక్ష కాంగ్రెస్ మాత్రం ఇండియా శత్రువులకు ప్రయోజనం చేకూరేలా కామెంట్లు చేయడం దురదృష్టకరం. చైనా తమ వాదనను చెప్పడానికి రాహుల్ స్టేట్‌మెంట్స్‌ను ఉపయోగించే అవకాశం ఉంటుందని రామ్ మాధవ్ పేర్కొన్నారు.

# కాంగ్రెస్ కార్యక్రమాలను అడ్డుకుంటున్న పోలీసులు

### న్యాయపోరాటానికి సిద్ధం అవుతున్న నేతలు

హైదరాబాద్,జూన్19(ఆర్ఎన్ఎ):గత కొంత కాలంగా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రతి కార్యక్రమాన్ని ప్రభుత్వం అడ్డుకుంటుందని ఆరోపిస్తూ తెలంగాణ కాంగ్రెస్ నేతలు న్యాయపోరాటానికి సిద్ధమయ్యారు. తమ పార్టీ ప్రజాస్వామ్య బద్ధంగా అన్ని వేదికలపైనా తన వాదన వినిపించినా ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించామని కాంగ్రెస్ నేతలు తెలిపారు. గురువారం సీనియర్ లాయర్ రచనరెడ్డి కాంగ్రెస్ పార్టీ పక్షాన రాష్ట్ర హై కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసినట్టు వారు చెప్పారు.

కోవిడ్ నిబంధలను అనుసరించి జూన్ 2న కృష్ణ నది పైన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులను సందర్శించేందుకు కాంగ్రెస్ నాయకులు కార్యక్రమాన్ని ప్రకటిస్తే 1 వ తేదీన రాత్రి నుంచే ఎమ్మెల్యేలతో పాటు ఎంపీలను, ముఖ్య నాయకులను.. పోలీసులు గృహ నిర్బంధాలు, అరెస్టులు చేసి అడ్డుకున్నారని తెలిపారు. జూన్ 4వ తేదీన టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి లు సంగారెడ్డి పట్టణ సమీపంలోని మంజీరా డ్యామ్ ను పరిశీలిస్తామంటే పఠాన్ చెరువు దగ్గర అరెస్ట్ చేసి భానూర్ పోలీస్ స్టేషన్ లో రోజంతా ఉంచారన్నారు. జూన్ 11వ తేదీన సీఎల్పీ నేతృత్వంలో సీఎస్ ను, మంత్రులను సెక్రటేరియట్లో కలిసి వినతి పత్రాలు ఇవ్వాలని ప్రయత్నిస్తే ముఖ్య నాయకులందరినీ అరెస్టులు చేశారని తెలిపారు. అలాగే 13వ తేదీన గోదావరి నది పైన ప్రాజెక్టులను సందర్శించాలని కాంగ్రెస్ నాయకులు కార్యక్రమాన్ని ప్రకటిస్తే రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులను గృహ నిర్బంధాలు, అరెస్టులు చేశారని అన్నారు. వీటిపైన డీజీపీకి వినతి పత్రాలు ఇచ్చినా, ముందుగా అనుమతులు అడిగినా.. ప్రభుత్వం కోవిడ్ 19 నిబంధనలు సాకుగా చూపి అరెస్టులు చేసి అడ్డుకుంటున్నారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. అదే టీఆర్ఎస్ నేతల పార్టీ కార్యక్రమాలకు, వ్యక్తిగత కార్యక్రమాలకు మాత్రం ప్రభుత్వం, పోలీసులు ఎలాంటి ఆటంకాలు చెప్పలేదన్నారు. రాజకీయ దురుద్దేశంతో, కక్షపూరితంగా కాంగ్రెస్ నాయకులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అందుకే ఈ అంశాలపైన కాంగ్రెస్ పార్టీ న్యాయస్థానాన్ని ఆశ్రయించిందని నేతలు తెలిపారు.

# రైతులను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నాం

### సిఎం కెసిఆర్ సంకల్పం అదే అన్న మంత్రి

నిర్మల్,జూన్19(ఆర్ఎన్ఎ): రైతును ఆర్థికంగా పరిపుష్టం చెయ్యడమే సీఎం కేసీఆర్ సంకల్పమని, అందుకే రైతు సంక్షేమం కోసం ఆయన అనేక పథకాలను అమలు చేస్తున్నారని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం సూచించిన పంటలు వేసి ఆర్థికంగా బలపడాలని సూచించారు. రైతులందరూ ఒకచోట చేరి సాగు విధానాలపై చర్చించుకోవడానికి వీలుగా 'రైతు వేదిక'లను నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించిందని పేర్కొన్నారు. నిర్మల్ మండలం న్యూ పోచం పహాడ్‌లో అక్కపూర్ క్లస్టర్ రైతు వేదిక భవన నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేశారు. రైతు వేదికల నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని సీఎం కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు రూ.22 లక్షల వ్యయంతో తన సొంత నిధులతో దివంగత అల్లోల చిన్నమ్మ-నారాయణ రెడ్డిల స్మారకార్థం ఈ వేదికను నిర్మిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. దీంతో రైతు శిక్షణ కార్యక్రమాలను చెట్ల కింద, పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించే కష్టాలు తప్పనున్నాయని వెల్లడించారు. రైతు వేదిక కార్యక్రమం ద్వారా క్లస్టర్ లోని రైతులందరికి ఎంతో ఉపయోగప డుతుందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే మొట్ట మొదటి రైతు వేదికను నిర్మల్ లో ప్రారంభించుకున్నామని తెలిపారు.




నిర్మల్ జిల్లా న్యూ పోచంపహాడ్‌లో అక్కపూర్ క్లస్టర్ రైతు వేదిక భవన నిర్మాణానికి భూమిపూజ చేసిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి.

# రానున్న ఐదేళ్లలో పెరగనున్న పట్టణ జనాభా

### ప్రజల వలసలే కారణమన్న మంత్రి కెటిఆర్

తహైదరాబాద్,జూన్19(ఆర్ఎన్ఎ): తెలంగాణలో రానున్నఐదేళ్లలో మెజార్టీ జనాభా పట్టణల్లోనే ఉండే అవకాశం ఉందని మున్సిపల్‌శాఖ మంత్రి కె.తారక రామారావు అన్నారు. భారీఎత్తున జనాబా పట్టణాలలో కేంద్రీకృతమైన నేపద్యంలో వాటిని ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. పౌరసేవలే కేంద్రంగా నూతన పురపాలక చట్టాన్ని తెలంగాణ తీసుకు వచ్చిందన్నారు. ఈ చట్టంలోని విధులు అధికారాలు ఖచ్చితంగా పాటించేలా అధికారులు పనిచేయాలని అన్నారు. మహబూబ్‌నగర్, గద్వాల, నారాయణపేట జిల్లా పరిధిలోని మున్సిపాలిటీల గురువారం నగరంలోని ఎంసిహెచ్‌ఆర్‌డిలో మంత్రి కేటీఆర్ సమీక్ష నిర్వహించారు. ఈసమావేశానికి మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, స్థానిక ఎమ్మెల్యేలు హాజరయ్యారు. కొత్త జిల్లాలుగా మారిన నారాయణపేట, గద్వాల్ జిల్లా కేంద్రాల్లో స్పష్టమైన మార్పు కనిపించేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి కేటీఆర్ సూచించారు. మూడు జిల్లాల పరిధిలోని అన్ని మున్సిపాలిటీల్లో రోడ్లు, గ్రీనరీ, స్మశాన వాటికల వంటి ప్రాధమిక అంశాలపై పూర్తి శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత వర్షాకాలం నేపథ్యంలో సీజనల్‌వ్యాధులు ప్రబలకుండా అరికట్టేందుకు పారిశుద్ధ్యం పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్లు, ఛైర్మన్లను ఆదేశించారు.ప్రస్తుతం కొత్త మున్సిపాలిటీలలో ఉన్న ఎల్ఆర్ఎస్ అవకాశాన్ని వినియోగించుకునేలా ప్రత్యేక ఎల్ఆర్ఎస్ మేళాలు నిర్వహించాలన్నారు. ఈసారి ఎల్ఆర్ఎస్ అవకాశం కేవలం నూతన మున్సిపాలిటీలు, మున్సిపాలిటీలలో విలీనమైన గ్రామాలకు మాత్రమే అని గతంలో మున్సిపల్‌శాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. కొత్త మున్సిపాలిటీల్లో ఎల్ఆర్ఎస్‌కు అవకాశం పై విస్తృత ప్రచారం నిర్వహించాలని మంత్రి కేటీఆర్ ఆదేశించారు. సెప్టెంబరు వరకు ఎల్ఆర్ఎస్ గడువు కొనసాగించాలని, 43 నూతన మున్సిపాలిటీల్లోఎల్ఆర్ఎస్‌కు అవకాశం ఉందని చెప్పారు.

# మొక్కలు నాటిన మంత్రి మల్లారెడ్డి, ఎంపీ సంతోష్‌కుమార్



మేడ్చల్ మల్కాజ్‌గిరి,జూన్ 19: గ్రీన్ ఛాలెంజ్ మూడవ విడత కార్యక్రమంలో భాగంగా నేడు శామీర్‌పేటలోని బిట్స్‌పిలానీ క్యాంపస్ ఆవరణలో హరితహారం కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ సంతోష్‌కుమార్‌తో పాటు మంత్రి మల్లారెడ్డి పాల్గొని మొక్కలు నాటారు.

మొక్కలు నాటే కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌రావు, ఎమ్మెల్యే కే.పి.వివేకానంద, మాధవరం కృష్ణారావు, కలెక్టర్ వెంకటేశ్వర్లు, మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇంఛార్జీ మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

### సీజనల్‌వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో

## పోలీస్‌స్టేషన్ల ఆవరణలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలి

### -కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి




కరీంనగర్,జూన్ 19 (నేటినిజం ప్రతినిధి):ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలేఅవకాశాలుపొంచిఉన్నందున వివిధ పోలీస్‌స్టేషన్లు, వివిధ విభాగాలకు చెందిన కార్యాలయాల ఆవరణలో నీరునిలిచిఉండకుండా చర్యలు తీసుకోవాలని కమిషనరేట్‌లోని పోలీసు అధికారులను కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి ఆదేశించారు. వర్షాల కురిసిన సందర్భాలలో నీరుగారే ప్రదేశాలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేయించాలని పేర్కొన్నారు.

కమిషనరేట్‌లోని ప్రతిస్థాయి పోలీసులందరూ పరిసరరాల పరిశుభ్రతకోసం రోజులో 30నిమిషాలు కేటాయించాలని సూచాంచారు. నీరునిలిచి ఉండటం వల్ల దోమలు ఏర్పడి డెంగ్యూలాంటి వ్యాధులతోపాటు ఇతర రకాల జ్వరాలు వచ్చేప్రమాదాన్ని గుర్తించి ఈ ముందస్తుచర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుత వర్షాకాలంలో అన్నిస్థాయిలకు చెందిన పోలీసులు రేయిన్‌కోట్‌లను వెంట ఉంచుకోవాలని చెప్పారు. ప్రస్తుతం నెలకునిఉన్న విపత్కరపరిస్థితులకు కారణమయ్యే లక్షణాలు కలిగిఉన్న వ్యక్తులకు దూరంగా ఉంటూ విధినిర్వాహణ సందర్భంగా తగుజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ప్రతి శనివారం వివిధ విభాగాల పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించాలి

పోలీస్‌స్టేసన్లలోని వివిధ విభాగాల పనితీరును సంబంధిత ఎస్‌హెచ్‌ఓలు పరిశీలించడంతోపాటు ప్రతిశనివారం వివిధ విభాగాలకు చెందిన పోలీసులతో ప్రత్యేకసమావేశం నిర్వహించి విభాగాల పనితీరును సమీక్షించాలని చెప్పారు. వివిధ పోలీన్‌స్టేషన్లకు చెందిన అధికారులు సదరువిభాగాల పనితీరును పరిశీలిస్తున్నారా?లేదా?అనే విషయాన్ని గుర్తించేందుకు ఏసిపిలు ఆకస్మికంగా పోలీస్‌స్టేషన్ల తనిఖీలను నిర్వహించాలని ఆదేశించారు.

పెండింగ్ కేసుల్లో విచారణ వేగవంతం చేయాలి

పెండింగ్‌లో ఉన్న కేసుల్లో దర్యాప్తులను వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. నిందితులకు శిక్షలు విధించబడే విషయం నాణ్యతప్రమాణాలు కలిగిన దర్యాప్తులపై ఆధారపడిఉంటుందనే విషయాన్ని గుర్తించాలని చెప్పారు. ఎస్‌సి/ఎస్‌టి కేసుల విచారణలుకూడా వేగవంతంగా పూర్తిచేయాలని తెలిపారు. దర్యాప్తులు పూర్తయిన కేసుల్లో ఛార్జిషీట్లను దాఖలుచేసి సంబంధిత సిసినెంబర్లను న్యాయస్థానాల నుండి తీసుకోవాలని పేర్కొన్నారు. సమన్లు,వారెంట్ల అమలును వేగవంతం చేయాలని ఆదేశించారు.

అక్రమకార్యకలాపాలకు పాల్పడేవారిని బైండోవర్ చేయించాలి

అక్రమకార్యకలాపాలకు పాల్పడేవారిని సంబంధిత తహసిల్దార్‌ల వద్ద బైండోవర్ చేయించాలని ఆదేశించారు. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి 06నెలల జైలు లేదా ఒకలక్షరూపాయల వరకు జరిమాన కొన్నిప్రత్యేక పరిస్థితుల్లో రెండునూకూడా విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు. అక్రమకార్యకలాపాలను గుర్తించేందుకు ప్రత్యేక సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అక్రమకార్యకలాపాలకు సంబంధించిన సమాచారం అందించేవారిపేర్లను గోప్యంగా ఉంచడంతోపాటు నగదుపారితోషికం అందజేస్తామని పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి ప్రకటించారు.

## రాజ్యసభ ఎన్నికల్లో ఓటేసిన సిఎం వైఎస్ జగన్

అమరావతి,జూన్19(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న రాజ్యసభ ఎన్నికల్లో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్‌లో అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారామ్, మంత్రులు, ఎమ్మెల్యేలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఏపీలో మొత్తం నాలుగు రాజ్యసభ స్థానాలకు ఐదుగురు పోటి పడుతున్నారు. వీరిలో అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పిల్లి సుభాష్ చంద్రబోస్, మోపిదేవి వెంకటరమణ, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పరిమళ్ నత్వానిలు ఉన్నారు. సరైన సంఖ్యా బలంలేకున్నా టీడీపీ నుంచి వర్ల రామయ్య పోటీలో ఉన్నారు. సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగనున్నది.

## ఏపీలో బోట్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

### -వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించిన సిఎం

అమరావతి,జూన్19(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శుక్రవారం టూరిజం బోట్ కంట్రోల్ రూమ్‌లను ప్రారంభించారు. తాడిపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి పలు జిల్లాల్లో ఏర్పాటు చేసిన 9 కంట్రోల్‌రూమ్‌లను వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా ప్రారంభించారు. నదీతీర పర్యాటక ప్రాంతాల్లో సురక్షిత బోటింగ్ కోసం కంట్రోల్‌రూమ్‌లను ఏర్పాటు చేశామని సీఎం జగన్ తెలిపారు. బోటింగ్ ఆపరేషన్స్‌ను జిల్లా కలెక్టర్లు ఎప్పటికప్పుడూ పర్యవేక్షించాలని అన్నారు. కంట్రోల్ రూమ్‌లు నిబంధనలు పాటిస్తున్నాయా లేదా పరిశీలించాలని పేర్కొన్నారు. ఒక్కో కంట్రోల్ రూమ్‌లో తహసీల్దార్ స్థాయి అధికారి పర్యవేక్షణలో ఇరిగేషన్ అధికారులు, పోలీసులు నీటీ వ్యవస్థ, పర్యాటకుల భద్రత అంశాలను పరిశీలిస్తారని వెల్లడించారు.

## రోడ్డు ప్రమాదంలో నవ దంపతుల మృతి

ఏలూరు,జూన్19(ఆర్ఎన్ఎ):పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నవదంపతులు చనిపోయారు. యడవల్లి వెంకటేశ్ (30), మానస నవ్య (26)లకు ఈ నెల 14న వివాహమైంది. నాలుగు రోజుల తర్వాత గురువారం మధ్యాహ్నం గుంటూరు జిల్లా గోవాడ నుంచి భార్య, ఆమె సోదరుడు భరత్‌తో కలిసి వెంకటేశ్ విశాఖ జిల్లా సబ్బవరానికి కారులో బయలుదేరాడు. ఈ క్రమంలో పశ్చిమగోదావరి జిల్లా భీమడోలు సమీపంలోని పూళ్ల దగ్గర కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి అవతలివైపునకు దూసుకెళ్లింది.

అదే సమయంలో ఏలూరు వైపు వెళ్తున్న లారీ వీరి కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటేశ్, మానస నవ్య, భరత్, కారు డ్రైవర్ చంద్రశేఖర్ (64) తీవ్రంగా గాయపడ్డారు. అదే సమయంలో అటువైపు నుంచి వెళ్తున్న ఏలూరు డీఎస్పీ దిలీప్ చరణ్ స్థానికుల సాయంతో గాయపడిన వారిని తన వాహనంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే వెంకటేశ్, నవ్య, చంద్రశేఖర్ మృతి చెందినట్టు డాక్టర్లు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడిన భరత్ చికిత్స పొందుతున్నాడు. వివాహమై వారం రోజులు కూడా కాకముందే ఇద్దరూ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం రెండు కుటుంబాల్లోనూ తీవ్ర విషాదాన్ని నింపింది.

## బీహార్‌కు చెందిన కిశోర్‌సింగ్ అంత్యక్రియలు పూర్తి

పాట్నా,జూన్19(ఆర్ఎన్ఎ): భారత్, చైనా మధ్య గాల్వన్‌లో జరిగిన ఘర్షణలో బిహార్ రాష్ట్రం వైశాలి జిల్లాకు చెందిన జై కిశోర్‌సింగ్ అమరుడయ్యారు. కిశోర్‌సింగ్ అంత్యక్రియలను శుక్రవారం అతడి సొంత జిల్లా వైశాలిలో ప్రభుత్వ లాంఛనాలతో పూర్తి చేశారు. ఈ సందర్భంగా సైనిక దళం ఆయనకు ఆర్మీ సంప్రదాయం ప్రకారం నివాళులర్పించింది. కిశోర్‌సింగ్ అంతిమయాత్రకు భారీగా జనం తరలిరావడంతో ఆంక్షల నడుమ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. చిన్నవయ స్సులోనే ఆర్మీలో చేరి దేశం కోసం ప్రాణాలొదిలిన జై కిశోర్‌సింగ్‌ను తలుచుకొని తోటీ సైనికులు, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. కిశోర్‌సింగ్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది.

# మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు



గ్రీన్‌ఫ్రైడేను పురస్కరించుకుని తన అధికారిక నివాసంలో మొక్కలు నాటిన మంత్రి సత్యవతి రాథోడ్

హైదరాబాద్,జూన్19(ఆర్ఎన్ఎ): మంత్రి కెటిఆర్ ఇచ్చిన గ్రీన్ ఫ్రైడేలో భాగంగా మంత్రులు, ప్రజా ప్రతినిధులు పలుచోట్ల మొక్కలు నాటారు. అలాగే గ్రీన్ ఛాలెంజ్ మూడవ విడత కార్యక్రమంలో భాగంగా శామీర్‌పేటలోని బిట్స్‌పిలానీ క్యాంపస్ ఆవరణలో హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సంతోష్‌కుమార్‌తో పాటు మంత్రి మల్లారెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. మొక్కలు నాటే కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌రావు, ఎమ్మెల్యే కే.పి.వివేకానంద, మాధవరం కృష్ణారావు, కలెక్టర్ వెంకటేశ్వర్లు, మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇంఛార్జీ మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు. ఇదిలావుంటే ముఖ్యమంత్రి కేసీఆర్ కలలు కన్న ఆకుపచ్చ తెలంగాణను ఆవిష్కరిద్దామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రిసత్యవతి రాథోడ్ అన్నారు.

## గ్రీన్‌ఫ్రైడే పిలుపుతో రంగంలోకి దిగిన నేతలు

పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి ఒక్కరు గ్రీన్ ఫ్రైడేలో పాల్గొని మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. గ్రీన్ఫ్రైడేలో భాగంగా హైదరాబాద్ లోని తన నివాసంలో మంత్రి మొక్కలు నాటారు. ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్న హరితహారంలో ప్రతి ఒక్కరు పాల్గొని తమ ఇళ్లలో, పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. గ్రామ పంచాయతీల్లోనూ, మునిసిపాలిటీల్లోనూ హరితహారం కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, ఖర్చు చేస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపల్‌శాఖ మంత్రి కె. తారక రామారావు ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. హరితహారంలో భాగంగా పట్టణాల్లో భారీగా మొక్కలు నాటి హరిత పట్టణాలుగా తీర్చిదిద్దడానికి ఇలాంటి కార్యక్రమం ఎంతో ఉపయోగ పడుతుందని ఆయన అన్నారు. మంత్రి కేటీఆర్ ప్రతి శుక్రవారం గ్రీన్ ÷-రెల్గ÷డేగా పాటించి మొక్కలు నాటి, ప్రతి మొక్కను కాపాడాలంటూ ఇచ్చిన పిలుపు మేరకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నగరంలోని తన నివాసంలో ఈత, జామ, అరెలియా, మందారం మొక్కలన తన కుమార్తె శ్రీహిత, మనుమరాలు సిద్ధిక్షలతో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ద్వారా ఎంతో లాభం కలుగుతుందన్నారు. ముఖ్యంగా మొక్కలు నాటడం వల్ల మంచి వాతావరణం ఏర్పడడానికి అవకాశం ఉంటుందన్నారు. మంత్రి కేటీఆర్ ఇచ్చిన పిలుపును అందుకుని ప్రతి ఒక్కరూ తమ పరసరాలు, ఇళ్లల్లోనూ మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని అన్నారు.

## కరోనా పాజిటివ్..అయినా ఓటేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యే

భోపాల్,జూన్19(ఆర్ఎన్ఎ): మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేకు కరోనా పాజిటీవ్‌గా నిర్ధారణ అయ్యింది. అయితే అక్కడ రాజ్యసభ స్థానాలకు పోలింగ్ జరుగుతుండడంతో శుక్రవారం ఆయన పీపీఈ కిట్ ధరించి తన ఓటు హక్కు వినియోగించుకోవడానికి భోపాల్‌లోని శాసనసభకు వచ్చారు. ఎన్నికల సిబ్బంది ఆయన ఓటు వేయడానికి అన్ని ఏర్పాట్లు చేయడంతో.. భౌతిక దూరం పాటించి.. ఏ ఒక్కరినీ కలువకుండా ఓటు వేసి వెళ్లిపోయారు. ప్రస్తుతం మధ్యప్రదేశ్‌లో మూడు రాజ్యసభ స్థానాలకు ఓటింగ్ జరుగుతుంది. ఆయన వెళ్లిన తరువాత పరిసరాల్లో రసాయనాలు పిచికారీ చేయడంతో పాటు, శానిటైజ్ చేశారు.

## ప్రతిదినం ప్రజాహితం

### దేవులపల్లి అమర్ పుస్తకాన్ని ఆవిష్కరించిన విజయమ్మ

హైదరాబాద్,జూన్19(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ నేషనల్ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ రచించిన 'ప్రతి దినం ప్రజాహితం' పుస్తకాన్ని వైఎస్సార్‌సీపీ గౌరవ అధ్యక్షురాలు వైఎస్ విజయమ్మ ఆవిష్కరించారు. ఏడాదికాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అనేక కార్యక్రమాలను ఈ పుస్తకంలో పొందుపరిచారు. ఈ సందర్భంగా విజయమ్మ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఏడాది కాలంలోనే వైఎస్ జగన్ 90శాతం హామీలను అమలు చేశారని అభినందించారు. ఇచ్చిన హామీ మేరకు జూలై 8న ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నారని తెలిపారు. రాష్ట్రంలో 6 లక్షల మందికి కరోనా పరీక్షలు చేసి దేశంలోనే అగ్రస్థానంలో నిలిచామని గుర్తుచేశారు. రాష్ట్రాన్ని హరితాం ధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి ప్రాజెక్టుల నిర్మాణం వేగంగా జరుగుతోందని వైఎస్ విజయమ్మ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో అమర్, విజయమ్మతో పాటు మరికొంత మంది ప్రముఖులు పాల్గొన్నారు.

# నేటి నుంచి హరితహారం కార్యక్రమం

## జిల్లాలో 62లక్షలు మొక్కలు నాటాలన్న లక్ష్యం

### ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా అధికారులు

మహబూబ్‌నగర్,జూన్19(ఆర్ఎన్ఎ): ఈ నెల 20 నుంచి ఆరో విడుత హరితహారం ప్రారంభం కానున్న తరుణంలో ఉమ్మడి జిల్లాలో విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. హరితహారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు తెలిపారు. ఈ ఏడాది 62లక్షల మొక్కలు నాటుతున్నట్లు వెల్లడించారు. 1,350 ఎకరాల రెవెన్యూ స్థలాల్లో మొక్కలు నాటుతున్నాం. పండ్ల మొక్కలు నాటేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాం. దోమలను నివారించే మొక్కలను కూడా ప్రత్యేకంగా నాటుతున్నామని అన్నారు. ప్రతి రైతు తమ పొలం వద్ద 10 మొక్కలు నాటాలని నిర్దేశించాం. కార్యక్రమం విజయవంతం చేసేందుకు సిద్ధమయ్యామన్నారు. ఆరో విడుత హరితహారానికి సర్వం సిద్ధమైంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 2.8213 కోట్ల మొక్కలు నాటేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. గతేడాది ఉమ్మడి జిల్లాలో 9.97కోట్ల మొక్కలు నాటేందుకు లక్ష్యం విధించుకోగా.. 4.0458కోట్ల మొక్కలు నాటారు. అయితే ఇప్పటికే ఐదు విడుతల్లో హరితహారం కార్యక్రమం జరుగగా.. ఈ ఏడాది ఆరో విడుతలో భాగంగా 2.8213కోట్ల మొక్కలు నాటేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాల్లో అన్ని ప్రభుత్వ శాఖలు హరితహారంలో భాగమై మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నాయి. ఈ ఏడాది అటవీ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అటవీ ప్రాంతాల్లో మంకీ ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేసి కోతులు ఇతర అటవీ జంతువులకు ఫలాలు అందించేందుకు కృషి చేస్తున్నారు. గతేడాది నాటిన మొక్కలను సంరక్షించే అంశంలోనూ యంత్రాంగం విజయవంతంగా పనిచేసింది. ఈ ఏడాది సైతం తమ లక్ష్యాన్ని అధిగమించేం దుకు అన్ని జిల్లాల పాలనాధికారులు ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. హరితహారంలో భాగంగా నాటుతున్న కోట్లాది మొక్కలు పెద్ద వృక్షాలుగా మారితే ఎంతగానో ఉపయో గపడుతున్నది. నాటిన మొక్కను మూడేం డ్లు కాపాడుకోగలిగితే చాలు.. అది సొంతంగా నిలబడేందుకు అవకాశం ఏర్పడుతున్నది. వర్షాల అదునుతో ఉమ్మడి జిల్లాలో హరితహారం కార్యక్రమం సకాలంలో ప్రారంభించేందుకు అవకాశం ఏర్పడింది. వారం రోజులుగా జిల్లాలో అడపాదడపా కురుస్తుండటతో ఇప్పటికే మొక్కలు నాటేందుకు గుంతలు తీసి సిద్ధంగా ఉంచుకున్నారు. పలుచోట్ల ఇంకా గుంతలు తీసే కార్యక్రమం వేగంగా సాగుతోంది. ఉమ్మడి జిల్లాలో 2.8213 కోట్ల మొక్కలు నాటేందుకు ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశిరచగా ఇప్పటికే అన్ని జిల్లాల్లో సుమారు 5 లక్షలకు పైగా గుంతలు సిద్ధమయ్యాయి. వర్షాలు పడుతున్నందున గుంతలు తీసేందుకు కూలీలకు సులువుగా మారింది. ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా కూలీలు గుంతలు తీసే కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

కొత్త పంచాయతీరాజ్ చట్టం మేరకు ప్రతి గ్రామ పంచాయతీ తప్పనిసరిగా మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సి ఉంది. ఈ నిబంధన మేరకు ప్రస్తుతం గ్రామాలకు బాధ్యత వహిస్తున్న ప్రత్యేకాధికారులు సైతం హరితహారం కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొంటున్నారు. ఏదో మొక్కబడిగా మొక్కలు నాటామంటే కుదరదు. హరితహారంలో గ్రామాల పాత్ర పెరుగడంతో పచ్చదనం పెంపొందించేందుకు మరింత అవకాశం ఏర్పడింది. ఏ గ్రామానికి ఇచ్చిన లక్ష్యం ఆ గ్రామం తప్పనిసరిగా పూర్తి చేయాల్సి ఉంది. సర్పంచులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని హరితహారం కార్యక్రమాన్ని తప్పనిసరిగా పూర్తి చేయాల్సి ఉంది. కలెక్టర్ స్థాయిలో హరితహారంపై సమీక్ష జరుగనున్నందున కార్యక్రమం విజయవంతంగా సాగేందుకు అవకాశం ఏర్పడింది. పండ్ల మొక్కలు, నీడనిచ్చే చోట మంకీ ఫుడ్ కోర్ట్స్ ఏర్పాటు చేయనున్నారు. అటవీ స్థలాల్లో పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేందుకు స్థల సేకరణ చేస్తున్నారు. పట్టణాలు, జనావాసాల చెంతకు కోతులు రాకుండా చేసేందుకు ఈ ప్రయత్నం జరుగుతున్నది. వనపర్తి జిల్లాలో ఖిల్లాఘణపూర్, వనపర్తి ఫారెస్ట్ రేంజ్ పరిధిలో ఈ కోర్టులు ఏర్పాటు చేస్తున్నారు. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోనూ పెద్ద ఎత్తున మంకీ కోర్టులు ఏర్పాటు చేస్తున్నారు. నారాయణపేట జిల్లాలో 17 చోట్ల మంకీ కోర్టులు ఏర్పాటు చేసేందుకు యంత్రాంగం సిద్ధమైంది. మంకీ ఫుడ్ కోర్టుల వల్ల కోతుల బెడద తగ్గడంతో పాటు అడవుల్లోనే వాటికి పండ్లు ఆహారంగా లభించేందుకు అవకాశం ఉంది. మరోవైపు పచ్చదనం సైతం పెరగనున్నది. అడవుల మధ్యలో ఏర్పాటు చేయడం వల్ల పండ్ల మొక్కలు జంతువులకు ఉపయోగపడనున్నాయి.

# సామాన్యుల అరచేతిలో వాతావరణ సమాచారం



హైదరాబాద్, జూన్ 19: రాష్ట్ర వాతావరణ సమాచారం, వర్ష సూచన వంటి సమగ్ర వివరాలతో కూడిన మొబైల్ యాప్ ను సామాన్యులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ తెలిపారు. హైదరాబాద్ బంజారాహిల్స్ లోని మినిస్టర్స్ క్వార్టర్స్ అధికారిక నివాసంలో టీఎస్ – వెదర్ మొబైల్ యాప్, పోస్టర్స్ ను వినోద్ కుమార్ ఆవిష్కరించారు. తెలంగాణ స్టేట్ డెవలప్ మెంట్ ప్లానింగ్ సొసైటీ (టీఎస్ డీపీఎస్) ఈ యాప్ ను రూపొందించింది.

తఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ.. రైతులు, ప్రజలకు ఈ యాప్ ఎంతో ఉపయోగకరమన్నారు. వాతావరణ పరిస్థితులు, సూచనలతో రైతులు వ్యవసాయ పనులు, ప్రజలు ప్రయాణాలను కొనసాగించుకునేందుకు వీలు కలుగుతుందని పేర్కొన్నారు.

రాష్ట్రంలోని ఏ ప్రాంతం వివరాలైనా క్షణాల్లో అందించే విధంగా ఈ యాప్ ను తీర్చిదిద్దినట్లు ఆయన తెలిపారు. పల్లెలు, పట్టణాలు అనే భేదం లేకుండా ప్రతి ఒక్కరికీ ఈ యాప్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు.

## వేములవాడ సిఐగా వెంకటేష్



వేములవాడ, జూన్ 19 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ గా వెంకటేష్ శుక్రవారం భాద్యతలు స్వీకరించారు. వేములవాడ టౌన్ లో ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహించిన సి హెచ్. శ్రీధర్ కరీంనగర్ సిపి కి బదిలీ కావడంతో ఆయన స్థానంలో వెంకటేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందరభగా ఆయనకు స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్చం అందజేసి, స్వాగతం పలికారు

# భూ సేకరణ పనులు వేగవంతం చేయండి : మంత్రి హరీశ్‌రావు



సంగారెడ్డి , జూన్ 19: నేషనల్ హైవే-161 పనులు వేగవంతం చేయాలని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు అధికారులకు సూచించారు. సంగారెడ్డి కలెక్టరేట్ లో జిల్లాలో ఉన్న నాలుగు జాతీయ రహదారులపై విధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నేషనల్ హైవే161-ః నిర్మాణం కోసం భూ సేకరణ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

అలాగే ఎన్ హెచ్-65 పై భెల్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణం కోసం టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటించాలని నిర్మాణ సంస్థకు ఆదేశాలు జారీ చేశారు.

జిల్లాలో 1447 డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉందన్నారు.

వచ్చే రెండు నెలల్లో పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలో 116 రైతు వేదికలు నిర్మిస్తున్నామని వెల్లడించారు. జిల్లాలో నియంత్రిత సాగు వంద శాతం విజయవంతమైందని మంత్రి తెలిపారు. కరోనా వల్ల రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజలు స్వీయ ంత్రణ పాటించి అత్యవసరమైతెనే బయటికి రావాలన్నారు.

# అభివృద్ధిలో జిల్లాను ముందు వరుసలో ఉంచుతాం

### -ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్,జూన్19(ఆర్ఎన్ఎ): అభివృద్ధిలో జిల్లాను ముందు వరుసలో ఉంచుతానని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలోని 22వ వార్డు మధుర నగర్‌లో శుక్రవారం ఆయన రూ.15లక్షల నిధులతో డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో అన్ని వసతులు కల్పిస్తానని, సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతోందన్నారు. ఇతర రాష్ట్రాలు సైతం అభివృద్ధిలో తెలంగాణను రోల్‌మోడల్‌గా తీసుకుంటున్నాయన్నారు. ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు తెచ్చి జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు. ప్రస్తుతం కరోనా మహమ్మారి విజృంభిస్తుండడంతో ప్రజలంతా ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆయన వెంట స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులున్నారు.

# సాగు విధానాలపై చర్చించుకునేందుకే రైతు వేదికలు

నిర్మల్, జూన్ 19: రైతును ఆర్థికంగా ఎ2రిపుష్టం చెయ్యడమే సీఎం కేసీఆర్ సంకల్పమని, అందుకే రైతు సంక్షేమం కోసం ఆయన అనేక పథకాలను అమలు చేస్తున్నారని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. నిర్మల్ మండలం న్యూ పోచం పహాడ్ లో అక్కపూర్ క్లస్టర్ రైతు వేదిక భవన నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేశారు. రైతు వేదికల నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని సీఎం కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు రూ.22 లక్షల వ్యయంతో తన సొంత నిధులతో దివంగత అల్లోల చిన్నమ్మ- నారాయణ రెడ్డిల స్మారకార్థం ఈ వేదికను నిర్మిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం సూచించిన పంటలు వేసి ఆర్థికంగా బలపడాలని సూచించారు. రైతులందరూ ఒకచోట చేరి సాగు విధానాలపై చర్చించుకోవడానికి వీలుగా రైతు వేదిక'లను నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించిందని పేర్కొన్నారు. దీంతో రైతు శిక్షణ కార్యక్రమాలను చెట్ల కింద, పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించే కష్టాలు తప్పనున్నాయని వెల్లడించారు. రైతు వేదిక కార్యక్రమం ద్వారా క్లస్టర్ లోని రైతులందరికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే మొట్ట మొదటి రైతు వేదికను నిర్మల్ లో ప్రారంభించుకున్నామని తెలిపారు.

# మరో మంత్రికి కరోనా పాజిటివ్

చెన్నై,జూన్ 19: కరోనా వైరస్ మహమ్మారి తమిళనాడు రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తోంది. ఆ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి కేపీ అన్ బలగాన్ కు కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. దీంతో మంత్రి చికిత్స నిమిత్తం ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేరారు. కరోనా సోకిన మూడో రాజకీయ నాయకుడిగా మంత్రి నిలిచారు. ఇప్పటికే డీఎంకే ఎమ్మెల్యే జే అన్ బజాగాన్ కు కరోనా సోకడంతో చనిపోయారు. అన్నాడీఎంకే ఎమ్మెల్యే కే పళనికి కూడా కరోనా సోకింది. ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

కరోనా వైరస్ నియంత్రణ చర్యలపై విద్యాశాఖ మంత్రి అధ్యక్షతన ఓ కమిటీని ఏర్పాటు చేశారు. నార్త్ చెన్నై పరిధిలో ఈ కమిటీ పర్యవేక్షణ చేసింది. కరోనా నివారణ చర్యలపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఆ తర్వాతే మంత్రికి కరోనా లక్షణాలు బయటపడ్డాయి. సమీక్షలో పాల్గొన్న మిగతా వారు కూడా కరోనా పరీక్షలు చేయించుకోనున్నారు.

తమిళనాడులో ఇప్పటి వరకు 52,334 పాజిటివ్ కేసులు నమోదు కాగా, 625 మంది ప్రాణాలు కోల్పోయారు. కరోనా పాజిటివ్ కేసుల్లో మహారాష్ట్ర మొదటి స్థానంలో ఉండగా, తమిళనాడు రెండో స్థానంలో, ఢిల్లీ మూడో స్థానంలో నిలిచింది.

# అయోధ్య ఆలయ పనులు నిలిపివేత

### -సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో ట్రస్ట్ నిర్ణయం

లక్నో,జూన్19(ఆర్ఎన్ఎ): చైనాతో లడఖ్ విషయంలో ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో.. అయోధ్యలో రామాలయ నిర్మాణం పనులను నిలిపివేస్తున్నట్లు రామమందిర ట్రస్టు పేర్కొన్నది. చైనాతో సరిహద్దు వద్ద పరిస్థితి భీకరంగా ఉందని, ఇప్పుడు దేశాన్ని రక్షించుకోవడమే ముఖ్యమని రామమందిర ట్రస్టు పేర్కొన్నది. గాల్వన్ లోయలో భారత, చైనా బలగాలు హింసాత్మక ఘర్షణకు దిగిన విషయం తెలిసిందే. ఆ గొడవలో భారత సైన్యానికి చెందిన 20 మంది సైనికులు అమరులయ్యారు. సుప్రీంకోర్టు ఇచ్చిన చరిత్రాత్మక తీర్పును ఆధారంగా చేసుకుని.. రామమందిర ట్రస్టు అయోధ్యలో ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టాలను కున్నది. ఇప్పటికే కొన్ని పూజలు జరిగాయి. ఇటీవలే అక్కడ శివుడికి రుద్రాభిషేకం నిర్వహించారు. ప్రధాని మోదీ చేతులగా మీదుగా అధికారిక పనులు ప్రారంభం కావాల్సి ఉన్నది. కానీ ఆ ముహూర్తాన్ని వాయిదా వేస్తున్నట్లు ట్రస్టు చెప్పింది. దేశంలో పరిస్థితులను అంచనా వేసిన తర్వాత.. రామాలయ నిర్మాణ పనుల గురించి కొత్త తేదీని వెల్లడించనున్నట్లు ట్రస్టు సభ్యుడు అనిల్ మిశ్రా తెలిపారు.

# చెరుకు రైతులకు తీపి కబురు

### -బకాయిలు చెల్లించిన యోగి ఆదిత్యనాథ్

లక్నో,జూన్19(ఆర్ఎన్ఎ): ఉత్తర ప్రదేశ్ చెరకు రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ శుక్రవారం చెప్పారు. రాష్ట్రంలోని చెరకు రైతులకు రికార్డు స్థాయిలో చెల్లింపులు జరిపినట్లు, 2017 నుంచి 2020 మధ్య కాలంలో 47.20 లక్షల మంది చెరకు రైతులకు రూ.1,00,000 కోట్లకు పైగా చెల్లించినట్లు చెప్పారు. ఉత్తర ప్రదేశ్ చెరకు రైతుల నుంచి కొనుగోలు చేసిన చెరకుకు 2014-17 మధ్య మూడేళ్ళలో రూ.53,367 చెల్లించినట్లు తెలిపారు. 2017-2020 మధ్య మూడేళ్ళ కాలంలో ఈ చెల్లింపులు రూ.1,00,000 కోట్లకు పెరిగాయన్నారు. అంటే 2017-2020 మధ్య కాలంలో రూ.46,633 కోట్లు అధికంగా చెల్లించినట్లు తెలిపారు. తమ ప్రభుత్వం చెరకు రైతుల ఆర్థిక ప్రయోజనాలను కాపాడేందుకు కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి యోగి చెప్పారు. కరోనా వైరస్ మహమ్మారి కారణంగా అమలు చేస్తున్న అష్ట దిగ్బంధనం సమయంలో మిగిలిన పరిశ్రమలు మూతబడినప్పటికీ, ఉత్తర ప్రదేశ్‌లోని పంచదార మిల్లులు యథావిధిగా క్రషింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

సంగారెడ్డి,జూన్19(ఆర్ఎన్ఎ): జిల్లాలో గంజాయి విక్రయాలు ఎక్కువైపోయాయి. తాజాగా కొండాపూర్ మండలం మ్లలెపల్లి గ్రామంలో ఓ వ్యక్తి గంజాయి విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద రెండు గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.

# దేశ సమగ్రతకు, సమైక్యత కాంగ్రెస్‌తోనే సాధ్యం



### -ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

వేములవాడ, జూన్ 19 (నేటినిజం ప్రతినిధి):భారతదేశ సమైక్యతా, సమగ్రతకు కాంగ్రెస్ పార్టీ పాటుపడ్డదని కాంగ్రెస్ పార్టీ వేములవాడ నియోజకవర్గం ఇన్చార్జ్ ఆది శ్రీనివాస్ రెడ్డి అన్నారు.భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి ఆధ్వర్యంలో నటరాజ్ విగ్రహం అన్నదానం కార్యక్రమం చేశారు. ఈసందర్భంగా ఆది శ్రీనివాస్ఇందిరాగాంధీ హయాంలో భూసంస్కరణల చేపట్టి పేదలకు ఆస్తి హక్కు కల్పించారని, అలాగే రాజభరణాల రద్దు చేసిన ధీశాలని కొనియాడారు.పేదలు, దళితులు, బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలిచిందని, ప్రదాని ఇందిరా గాంధీ రైతులకోసం కాలువలు తవ్వించి ఆనాడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించి వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించారని తెలిపారు.

బ్యాంకుల జాతీయీకరణ చేసి పేదలందరికీ రుణాలు అందించే అవకాశం కాంగ్రెస్ పార్టీ కల్పించిందన్నారు.సమాచార హక్కు చట్టం తీసుకువచ్చిందని పేర్కొంటూ, జాతీయ ఉపాధి హామీ పథకం కాంగ్రెస్ హాయాంలో తీసుకురాగా నేడు గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉపాధి దొరుకుతుందన్నారు.కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు సాగరం వెంకటస్వామి మాట్లాడుతూ18 సంవత్సరాలకే యువతకు ఓటుహక్కు కల్పించిన ఘనత రాజీవ్ గాంధీ కి దక్కుతుందన్నారు.పివి నర్సింహారావు, మన్మోహన్ సింగ్ లు ప్రధానులు కాలంలో ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చి దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టారని తెలిపారు. అన్నివర్గాలు, అన్ని ప్రాంతాలు, అన్ని రంగాల సంక్షేమం తో పాటు దేశం కోసం కాంగ్రెస్ పార్టీ ఎనలేని కృషి చేసిందని వెంకటస్వామి అన్నారు. రాహుల్ గాంధీ యువతకు అధిక ప్రాధాన్యతను ఇచ్చి ప్రోత్సహించారని కొనియాడారు..అమరుల త్యాగాల పునాదులు మీద సాధించుకున్న తెలంగాణాలో నేడు నియంత, నిర్భంధ పాలన సాగుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సంగ స్వామి యాదవ్ ,అర్బన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిల్లి కనుకయ్య , కాంగ్రెస్ నాయకులు కూరగాయల కొమరయ్య ,చిలుక రమేష్ ,పాత సత్యలక్ష్మి ,బస రాజశేఖర్,కనికరపు రాకేశ్ ,హైమద్ పాషా నాగుల రాముగౌడ్ ,ఎర్రం ఆగయ్య ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి ఫోరం లీడర్‌గా ముప్పిడి సునంద



వేములవాడ, జూన్ 19 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపాలిటీ లో బిజెపి ఫోరమ్ లీడర్ గా ముప్పిడి సునంద శ్రీనివాస్ ను నియమిస్తున్నట్టు బిజెపి పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు .అలాగే డిప్యూటీ ఫోరం లీడర్ గా రామతీర్థపు కృష్ణవేణిని నియమించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూతమ పార్టీకి చెందిన మిగతా కౌన్సిలర్లతో కలిసి ప్రజల సమస్యలు ఎప్పుడు కప్పుడు గళాన్ని నిర్భయంగా వివరిస్తూ సమస్యల పరిష్కారం కృషి చేస్తామని వారు చెప్పారు .తమను నియమించిన ప్రతాప రామకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com